# లోగో చూసి కారు పేరు చెప్పేస్తాడు

## అబ్బురపరుస్తున్న బాలుడు, ఆరు ప్రపంచ రికార్డులు

ఆ బాలుడి వయస్సు రెండేళ్ల ఎనిమిది నెలలు. తన అద్భుత జ్ఞాపకశక్తితో 90 రకాల కార్ల లోగోలను చూసి సంస్థల పేర్లు



రికార్డులతో బాలుడు షంశ్రీతాన్స్. చిత్రంలో బీసీ కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు తదితరులు.

ఇట్టే చెప్పేస్తాడు. ఏ నుంచి జడ్ వరకు కార్ల బ్రాండ్ల పేర్లు చెప్పు, అందరినీ అబ్బురపరుస్తాడు. అతనే కొంపల్లికి చెందిన మాస్టర్ బి. షంశ్రీతాన్స్ కార్తికేయ. దీన్ని అరుదైన రికార్డుగా పేర్కొంటూ ఆరు ప్రపంచ రికార్డు' సంస్థలు ధ్రువపత్రాలు అందజేశాయి. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో షంశ్రీతాన్ష్ తన ప్రతిభను ప్రదర్శించారు. నర్సరీ చదువుతున్న బాలుడు, పార్కింగ్ స్థలంలో ఉండే కార్ల లోగోలను చూసి బ్రాండ్ల పేరు చెప్పడం చూసి కొత్త కొత్త కార్ల లోగోలు బ్రాండ్ పేర్లను నేర్పించినట్లు తల్లిదండ్రులు బి. వంశీకృష్ణ, అనుపమ వివరించారు. ఈ ప్రతిభను భారత్ వరల్డ్ రికార్డ్స్ తెలుగు వరల్డ్స్ రికార్డ్స్ తెలంగాణ వరల్డ్ రికార్డ్స్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అమేజింగ్ కిడ్ బుక్ ఆప్ రికార్డ్స్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్సులలో ప్రపంచ రికార్డులుగా నమోదు చేశారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు, రాష్ట్ర బీసీ కమీషన్ సభ్యులు వకుళాబరణం కృష్ణమోహన్‌రావు, దైవజ్ఞశర్మ చేతుల మీదుగా శుక్రవారం ఈ రికార్డులను అందజేశారు.

# 30న బీఎంఎస్‌లోకి కెంగెర్ల మల్లయ్య

పెద్దపల్లి,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): టీబీజీకేఎస్ మాజీ నేత కెంగర్ల మల్లయ్య ఈ నెల 30న బీఎంఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ఇటీవలే రాజనీమా చేసిన ఆయన బిజెపి అనుబంధ సంఘంలో చేరనున్నారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గోదావరిఖని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసే సభలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, వేజ్‌బోర్డు సభ్యుడు డీకే.రాయ్

సమక్షంలో మూడు వేల మందితో చేరుతున్నట్లు ప్రకటించారు. గోదావరిఖనిలో ఈ నెల 30న బీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ సభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వీరమనేని రవీందర్‌రావు కోరారు.

# "బతుకమ్మ మొగ్గలు" ఆవిష్కరణ



పాలమూరు జిల్లా ప్రముఖ కవి డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ రచించిన "బతుకమ్మ మొగ్గలు" కవితా సంపుటిని అక్టోబర్ 4 న రాష్ట్ర ఎక్సైజ్, యువజన సర్వీసుల, సాంస్కృతిక, పురాతత్వ శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. పాలమూరు జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ పై నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదైన సాంస్కృతిక పండుగ బతుకమ్మ అని కొనియాడారు. బతుకమ్మ పండుగ గురించి

భీంపల్లి శ్రీకాంత్ మొగ్గలు ప్రక్రియలో కవిత్వం రాయడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర శాసనసభ్యులు ఆల వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రాస్,జిల్లా పరిషత్ చైర్మన్ స్వర్ణసుధాకర్ రెడ్డి, తెలంగాణ జాగృతి జిల్లా కన్వీనర్ డాక్టర్ వై.వెంకట్రామమూర్తి,గన్నోజు శ్రీనివాసాచారి, డాక్టర్ గుంటి గోపి, బోల యాదయ్య, ఉప్పరి తిరుమలేష్, కొప్పోలు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో ఉధృతంగా ఆర్టీసీ సమ్మె

## –ప్రజా సంఘాల మద్దతుతో మరింత తీవ్రం

కరీంనగర్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): వివిధ పార్టీల నాయకులు సంఘీభావం, పలు సంఘాల నిరసన కార్యక్రమాలతో తీవ్రతరమైంది. కార్మికులు ఎవరూ విధులకు హాజరు కాలేదు. ఉదయం 6గంటలకే డిపో వద్దకు చేరు కుని నాయకులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వారి సూచనల మేరకు నిరసనలు చేపట్టారు .సమ్మెకు దిగిన కార్మికులు, ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోబోమంటూ సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనతో ఆర్టీసీలో సమ్మె మరింత ఉధృతమైంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే తదితర డిమాండ్లతో చేపట్టిన సమ్మె బుధవారం ఐదో రోజుకు చేరింది. ఉమ్మడి జిల్లాలో వివిధ డిపోల పరిధిలో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు బస్టాండ్లకు సమీపంలో నిరసన తెలిపారు. మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు కార్మికులకు అండగా ప్రదర్శనలో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగుల కోసం ఏమాత్రం ఆలోచించకుండా నియంతలా వ్యవహర్తిస్తున్నాడని ఆరోపించారు. ఉద్యోగుల హక్కుల కోసం అన్నివర్గాల ప్రజలు సహకరించాల ని కోరారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, జీతభత్యాల సవరించాలనే ప్రధాన డిమాండ్లతో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె జిల్లాలో సంపూర్ణంగా సాగింది. అయితే పండగపూట ప్రజలు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్మికులు ఒక్కరు కూడా విధులకు హాజరుకాలేదు. విధులకు హాజరుకాకుంటే ఉద్యోగాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లుగా భావిస్తామని ప్రభుత్వం హెచ్చరించినా కార్మికులు బేఖాతరు చేశారు. మొదటి షిఫ్టు నుంచి డ్రైవర్లు, కండక్టర్లు విధులకు హాజరుకాకపోవడంతో అద్దె బస్సులు మినహా సంస్థకు చెందిన బస్సులు రోడెక్కలేదు. అయితే అవేమీ ప్రయాణికుల అవసరాలను తీర్చలేకపోయాయి.

# వెన్నెలా ఓ వెన్నెలా !

వెన్నెలా ఓ వెన్నెలా
మా బతుకమ్మను కొలువనికి
మాతో ఆడనికి పాడనికి
రావా వన కన్నెలా

ఆడోల్లంటే అబలలు కాము
అన్ని రంగాల్లో సబలలమూ
మొగోల్లతో సమానంగా పని చేస్తామూ
మా జోలి కస్తే కరాటేతో తడాఖా సూపుతామూ..
వెన్నెలా ఓ వెన్నెలా ?

సాఫ్ట్ వేర్లో రాణిస్తామూ
ఇమానాలే నడిపిస్తామూ
పోలీసులై రౌడీల డొక్క చీలుస్తామూ
డోలుకట్టి ఊరంతా ఊరేగిస్తామూ..వెన్నెలా ఓ వెన్నెలా ?

బ్రేక్ డ్యాన్స్ చేసినా బ్రేక్ కాము మేమూ
కూచిపూడి కూడా చేసి మెప్పిస్తామూ
తీరొక్క పూలతోటి బతుకమ్మను పేర్చి
సుట్టూ తిరుగుతూ ఆడుతాము పాడుతామూ . వెన్నెలా ఓ వెన్నెలా ?

మేమెంత నవతరమైనా
పెద్ద పెద్ద సదువులు నేర్చినా
మన సంస్కృతి సాంప్రదాయాలంటే గౌరవముందీ
అవ్విట్లను హమేషా కాపాడుతామూ వెన్నెలా ఓ వెన్నెలా ?



– అంబల్ల జనార్ధన్
09987533225



# పాటే జీవితంగా మలచుకున్న ప్రజాకవి సుద్దాల హనుమంతు

## ఆయనతో నా జ్ఞాపకాలు కొన్ని...

మాది బ్రాహ్మణపల్లి. దాని పొలిమేర ఊరు సుద్దాల. సరిహద్దులు సాంకేతికమే. రెండు ఊర్ల మనుషులు మాత్రం ఒక్కటిగానే ఉంటూ వస్తున్నాం. ఈ రెండు ఊర్లు యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోనివి. సాహిత్య కళారంగాలలో గుండాల, మోత్కూరు, ఆత్మకూరు ప్రాంతాలు తనదైన బలమైన ముద్ర వేశాయి. కవులకు, కళాకారులకు పెట్టింది పేరు ఈ ప్రాంతం. చైతన్యం పులుముకున్న నేల అని చెప్పాలి. ప్రజాకవిగా, కళాకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, వైద్యులుగా ప్రజా హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారు సుద్దాల హనుమంతు గారు.

ప్రజాకవి సుద్దాల హనుమంతు గారు పుట్టింది పాలడుగులో. స్థిరపడింది సుద్దాలలో క్రమేపి ఊరు పేరే ఇంటి పేరుగా మారిపోయింది. ఇలా ఇంటిపేరుతోనో, ఊరు పేరుతోనో ప్రసిద్ధులైన వారు మనకు చరిత్రలో అగుపిస్తుంటారు. హనుమంతు గారు ప్రజా వాగ్గేయకారుడిగా గుర్తింపు పొందినవారే. వాళ్ల వారసత్వం అందిపుచ్చుకున్న ప్రజా సాహితీ సేనాని హనుమంతు గారు.

సుద్దాల హనుమంతు గారితో జ్ఞాపకాలు అన్నప్పుడు ఆయన సమకాలీన వ్యక్తి కాను. ఉద్యమ సహచరుణ్నీ అంతకన్నా కాదు. ఆయనతో కొంతకాలం సన్నిహితంగా మెదలడానికి, కలుసుకోవడానికి వారి కొడుకు ప్రముఖ సినీ గేయకవి అశోక్ తేజ గారే కారణం. ఇద్దరం దాదాపుగా సమవయస్కులం. మా ప్రక్క గామమైన సీతారామపురంలో ఇద్దరం ఉన్నత పాఠశాల విద్య కలిసి చదువుకున్నాం. రోజూ కాలినడకన బడికి వెళ్లే క్రమంలో మరింత దగ్గరయ్యాం. స్నేహపు దారులు మరింత విస్తృతమయ్యాయి.

ప్రతిభావంతులు ఏ రంగం వారైనా సమాజంచే తొందరగా గుర్తించబడుతారు. అశోక్ తేజ గారు ఇందుకు మినహాయింపు కాదు. తండ్రి సుద్దాల హనుమంతు గారి ప్రభావం ఆయనపై ప్రగాఢంగా ఉంది. బాల్య దశలోనే శ్రీశ్రీ, చలం, శరత్‌చంద్ర, ఠాగూర్ వంటి కవుల సాహిత్యాన్ని కంఠదఘ్నంగా చదువుకున్నాడు. మహాప్రస్థానం మొత్తం పుక్కిట పట్టిన ప్రతిభాశాలి. ఇక్కడో సందర్భం గుర్తు చేసుకోవాలి. మా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు "స్త్రీకి విద్య అవసరమా? లేదా?" అన్న అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థులందరూ సభాధ్యక్షులు అంటూ సంప్రదాయ పద్ధతిలో తమ ఉపన్యాసాలు మొదలుపెట్టసాగారు. ఇక అశోక్‌తేజ గారి వంతు వచ్చింది. "అగ్రసనాధిపా" అంటూ మొదలుపెట్టారు. ఉపాధ్యాయులతో పాటు అందరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. జాగ్రత్తగా అతని ఉపన్యాసం విన్నారు. చక్కని భాషతో పాటు అంశాన్ని బలంగా చెప్పగలిగాడు. చప్పట్లతో పాఠశాల మారుమ్రోగిపోయింది. ఈ గొప్ప వక్తృత్వం వెనకాల సుద్దాల హనుమంతు గారున్నారు. ఆధునిక సాహిత్యంతో పాటు ప్రాచీన సాహిత్యంపై కూడా ఎంతటి పట్టు ఉందో హనుమంతు గారికి. అశోక్‌తేజ గారి నోట పలికిన భాష, అల్లిక చెప్పకనే చెబుతున్నాయి అని అనుకున్నాం.

డా॥ సుద్దాల అశోక్‌తేజ గారితో పాఠశాల తరగతి గదిలో ఏర్పడ్డ స్నేహం ఆ నాలుగు గోడలకే పరిమితం కాలేదు. ఒకరి ఇంటికి మరొకరం వెళ్లేలా వేళ్లూనుకుంది. బలమైన మైత్రి మామధ్య ఏర్పడింది. ఈ స్నేహం హనుమంతు గారి ఇంట్లో స్వేచ్ఛగా గడిపిందుకు దారులు వేసింది. కుటుంబ సభ్యుడిగా మెదిలేందుకు ద్వారాలు తెరిచింది. ఆకలైతే అడక్కుండానే పెట్టుకొని తినే హక్కు కూడా కలిగింది. వందల సార్లు అలా తిన్నవాణ్ణే. గంటలు, రోజులు ఆ ఇంట గడిపిన వాణ్ణే.

సుద్దాల హనుమంతు గారి ఇల్లు కళా నిలయమనే చెప్పాలి. బీరువాల నిండుగా పుస్తకాలు. బెంచీలపైన, కుర్చీలపైన కొలువైన తబల, హార్మోనియం, గజ్జెలు, మృదంగం, ఇలా పలు సంగీత వాయిద్యాలు మనకు స్వాగతం పలుకుతుంటాయి. సంగీత భాషలో పలకరిస్తాయి కూడా. ఇంటికి కొత్త పుస్తకం వస్తే ఆ ఇంట పండుగే. ఒకరు చదువుతుంటే మిగతా వాళ్లు శ్రద్ధగా వినేవాళ్లు. తర్వాత చర్చ సాగేది. మరో రోజు పాటు కచేరి జరిగేది. ఇంతకు ముందు చెప్పుకున్నట్టుగానే 'పాట' ఆ కుటుంబంతో కలిసి తరాలుగా అడుగులు వేస్తూ వస్తుంది. అశోక్‌తేజ గారు పాటల రచయితగా జాతీయ స్థాయిలో గుర్తింపును పొందితే, కూతురు భారతి, రెండో కొడుకు ప్రభాకర్ తేజ గాయకులుగా గొప్ప గుర్తింపును పొందారు. చిన్న కొడుకు సుధాకర్ తేజ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఉన్నారు.

వాస్తుశాస్త్రంలో నిష్ణాతులు ఆయన.

ఓ సాయంత్రం నేను హనుమంతు గారి ఇంటికి వెళ్ళేసరికి పాటల కచేరి మొదలైంది. ఒక్కొక్కరి చేతిలో ఒక వాయిద్యం. ముందు అశోక్‌తేజ గారు పాడారు. ఆ తర్వాత భారతి, ప్రభాకర్‌తేజ పాడారు. ఇక హనుమంతు గారి వంతు వచ్చింది. పల్లెటూరి పిల్లగాడా,

> **ప్రతిభావంతులు ఏ రంగం వారైనా సమాజంచే తొందరగా గుర్తించబడుతారు.**

మంటలు మంటలు ఆకలి మంటలు, వెయ్ వెయ్ వేయర దెబ్బ ఇలాంటి 'ఆయన' పాటలు ప్రజల నాలుకపై నిలిచిపోయాయి. అప్పటికే ఆబాలగోపాలం హనుమంతు గారి పాటలు పాడుతుండేవారు. పల్లెటూరి పిల్లగాడా పాట ఇప్పటికే ఎవర్‌గ్రీన్. ఆ పాటను పాడుమని కోరగా పాడి వినిపించారు. ఎంతటి మధుంస్వరం. నిజంగా నా జన్మధన్యమని భావించాను. ఓ గొప్ప ప్రజాకవితో పాటలు పాడించు కోగలిగానా! అని ఇప్పుడనిపిస్తుంది. గుర్తు చేసుకుంటే ఆశ్చర్యమూ వేస్తుంది.

మరోసారి నేను హనుమంతు గారి ఇంటికి వెళ్ళే సరికి అశోక్‌తేజ గారు లేరు. హనుమంతు గారు ఏదో పుస్తకం చదువుతున్నారు. ఎన్నోయేండ్లుగా నాలో గూడుకట్టుకున్న ఒక సందేహం వారి ముందుంచాను. మీరు పక్కా కమ్యూనిస్ట్ కదా! అదే స్థాయిలో భక్తిపరులు కూడా. రెండు విభిన్న మార్గాలు ఒకటిగా ఎలా మలచుకోగలిగారని అడిగాను. ఏమాత్రం కోపగించుకోకుండా, అసహనం ప్రకటించకుండా నా సందేహాన్ని నివృత్తి చేశారు. మనలో ద్వైదీభావం ఉన్నప్పటికీ అది సమాజానికి గానీ, వ్యక్తులకు ఇబ్బంది కలిగించకూడదని వివరించారు. అలాగే శివతత్వాన్ని కూడా గొప్పగా వివరించారు. నేను అశోక్‌తేజకు రాసిన ఉత్తరాన్ని చదివి నాలోని సృజనశక్తికి గొప్ప కితాబు ఇచ్చారు. ఆయన కోరుకున్నట్టు కవిని కాలేకపోయినా, మంచి పాఠకున్ని మాత్రం కాగలిగాను.

ఇప్పటికీ గొప్పగా ఫీలయ్యే ఒక సందర్భం. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో నేను, అశోక్‌తేజ గారు ఇద్దరం కిరాయికి ఉంటూ చదువుకుంటున్నాం. మమ్మల్ని చూడటానికి లేదా తన వ్యక్తిగత పనులపై హైదరాబాద్ వచ్చినపుడు మా రూంకు వస్తుండేవారు హనుమంతు గారు. నాది ఈవినింగ్ కాలేజి, పగలు ఖాళీగా ఉంటూ ఉండేవాడిని. ఓసారి హనుమంతు గారు అభినవపోతన వానమామలై వరదాచార్యులు గారి వద్దకు తోడుగా తీసుకెళ్ళారు. సిద్ధాంతపరంగా ఇద్దరు ఉత్తర దక్షిణ ధృవాలు. అయినా వాళ్ల మధ్య జరిగిన చర్చ నన్ను ఎంతగానో ఆలోచింపజేసింది. రెండు, మూడు గంటలు సాగిన ఆ సాహిత్య చర్చ ఇప్పటికీ మధుర జ్ఞాపకంగా మిగిలిపోయింది.

సాయుధ పోరాటం తర్వాత తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన వృత్తి ఆయుర్వేద వైద్యం. ఆ వృత్తిని కొనసాగిస్తున్న క్రమంలోనే తొలిసారిగా ఆయన్ని మా గ్రామంలో చూశాను. దోస్తులతో కలిసి మసీదు దగ్గర ఆడుకుంటు ండగా తెల్లటి వర్చస్సు కలిగి అంతే తెలుపు కమీజు ధోవతి ధరించి సైకిల్‌ను నడుపుకుంటూ వస్తున్న హనుమంతు గారిని చూశాను. ఆయన ఎంత అందగాడో మాటల్లో చెప్పలేను. హనుమంతు గారు కళా ప్రపూర్ణుడైతే, అమ్మ జానకమ్మ అన్నపూర్ణ. ఇంటికి రోజు వచ్చే కళాకారులకు ఆత్మీయంగా అన్నం ఒడ్డించే సహృదయ ఇల్లాలు. ఆ చేతుల మీదుగా ఎన్నిసార్లు తిన్నానో! ప్రజల కోరిక మేరకు గ్రామ పంచాయతి సర్పంచ్ పదవికి పోటీ చేసి ఆ ఊరి దొరపై గెలిచిన ఘనత హనుమంతు గారిది. కొంత కాలానికి అనారోగ్యంతో మంచానపడ్డారు. క్యాన్సర్‌తో 1982 అక్టోబర్ 10న చివరి శ్వాస విడిచారు.

ఆ చివరి గడియల్లో కూడా నేను హనుమంతు గారి వద్దనే ఉన్నాను. భౌతికంగా ఆయన లేకున్నా ఆ ఉద్యమ స్ఫూర్తి అందించిన పాటలు తోబుట్టువులతో పాటు ఈ సమాజానికి వారసత్వంగా ఇచ్చారు. అది అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది.

తండ్రికి తగ్గ తనయుడిగా డా॥ సుద్దాల అశోక్ తేజ గారు కవిగా, గేయ రచయితగా ఎంతటి లబ్ద ప్రతిష్టలో నేను కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. జాతీయ పురస్కారం అందుకున్న తొలి తెలంగాణ సినీ గేయ కవిగా చరిత్రలో నిలిచారు. సుద్దాల ఫౌండేషన్ ద్వారా హనుమంతు గారిని శాశ్వతంగా మన మధ్యనే నిలిపారు. హనుమంతు గారితో సన్నిహితంగా మెదిలిన వారిలో నా రూంమేట్స్ ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకులు శ్రీరామోజు హరగోపాల్‌ను, సుభాష్‌ను గుర్తు చేసుకోవడం నా బాధ్యత. హనుమంతు గారి కుటుంబంతో అల్లుకుపోయిన బంధం నాది. అశోక్‌తేజ గారు నేను రెండు శరీరాలు, ఒక్క ఆత్మగా భావించు కుంటాం.

అక్టోబర్ 13న సుద్దాల హనుమంతు – జానకమ్మ జాతీయ పురస్కారాన్ని సుప్రసిద్ధ నటులు, దర్శకులు, నిర్మాత ఆర్. నారాయణమూర్తి గారికి ప్రదానం చేస్తున్న సందర్భంలో ఈ జ్ఞాపకాలు ఇలా అక్షర రూపం దాల్చుకున్నాయి.



–పెండెం సత్యనారాయణ
అధ్యక్షులు
'అమ్మయాది' పెండెం ఫౌండేషన్
బ్రాహ్మణపల్లి, గుండాల
సెల్: 8247312054






నేటి నిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com

గురువారం 10-10-2019    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    హైదరాబాద్ 3

## నమ్మలేని నిజాలు

బుద్ధుడి మాట
విశ్వశాంతి వెలుగు
చేతల్లో శూన్యం

శుభ్రత భావం
మహాత్ముడి కలలు
పగటికల

మందులు మాయం
నడుస్తున్న చరిత్ర
నిశబ్ధ రాజ్యం

కృత్రిమ చర్మం
తాజా ఆవిష్కరణ
ముడతలు మాయం.



– రేడియమ్
9291527757

## శ్రీనిజాలు

ఏడాది కొక్కసారే
బతుకమ్మిది ఉయ్యాలో!
ఆర్టీసీ, గవర్నమెంట్
పెట్టుకొనిరి కయ్యాలో!

పండుగనాడుప్రయాణం
మొలిచె అడ్డుగోడలు!
రెండు ఆంబోతుల మధ్య
ప్రజలు లేగ దూడలు!



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245






# మనసుకు తాకే మంచి కథలు

'ఒక మంచి కథకు నిర్వచనం ఏమిటి?" అన్న ప్రశ్నకు సూటిగా జవాబు చెప్పటం కష్టం.

కథ చదువుతున్నంత సేపూ, రచయిత పాఠకుడిని తన వెంట నడిపించుకుపోగలగాలి. రచయిత భావోద్వేగాలతో పాఠకుడు మమేకమవ్వాలి. చదివాక ఆ కథ తాలూకు భావనలు కొన్ని క్షణాలు, గంటలు ఒక్కోసారి కొన్నిరోజులు పాఠకుడి మనసుని అంటిపెట్టుకుని ఉండాలి.

ఈ నిర్వచనం భౌతిక రసాయన శాస్త్రాలలోని సిద్ధాంతాలలాగ ఖచ్చితమైనవి కావు. పైన చెప్పుకున్న 'స్పందన' అందరు పాఠకులలో ఒకే స్థాయిలో కలగకపోవచ్చును. కాని సంగెవేని రవీంద్ర మన ముందుకు తెచ్చిన కథా సంకలనం **"ముంబయి మేరీ జాన్"** చదివినప్పుడు చాలా మంది పాఠకులకు ఈ ఉద్వేగం తప్పక కలిగి తీరుతుంది.

సంకలనంలోని కథల్లో (ఒక్క 'దయ్యాల గోల'లో తప్ప) ఎక్కడా విశ్వామిత్ర సృష్టిగాని త్రిశంకు స్వర్గం కాని కనబడదు. సహజత్వం కుంటుపడదు. పాత్రలన్నీ, రోజూ మనం చూసే వ్యక్తుల్లా కనబడతాయి. సన్నివేశాలన్నీ నిన్న లేదా మొన్న మన కళ్ళెదుట కదలాడిన సంఘటనలులా అవుపిస్తాయి. జీవికకై తరతరాల్నుండీ మనిషి చేస్తున్న వలసలు, క్రొత్త భాష, వేషం, ఇమిడి పోవటానికి అంతర్యుద్ధం బాహ్య పోరాటం ఒక్క రవీంద్ర మాత్రమే చిత్రీకరించగలడు అన్నట్లుంటాయి. కొన్ని కథల్ని మినహాయిస్తే ఎక్కువ కథలు ముంబై జీవితాల్నుంచే వెలువడ్డాయి.

రచయిత "భాషా పరంగా తెలుగునేలపై ఉంటున్నవాడు కాడు. ఆర్థికంగా సుసంపన్నమైన వాడూ కాదు. పట్టుమని పది నిమిషాలు ప్రశాంతంగా గడిపే అవకాశము లేని వాడు. ఈ పోటీ ప్రపంచంలో అనుక్షణం పరుగెడుతూనే ఉండాల్సిన వేగవంతమైన నగరవాసి. తెలుగక్షరాలని 'దుర్భిణి' వెదుక్కునే పరిస్థితి. అయినా ఇంతటి గొప్ప కథల్ని– అందునా ప్రథమ ప్రయత్నంతోనే అందించగలగటం రచయిత ప్రతిభకు గీటురాయి. ముగ్ధమనోహర ముద్దబంతి పూవులాంటి పల్లె జీవనానికీ, జిలుగులు, తళుకులీనే కాగితపు పూవులాంటి ముంబయి జీవనానికి రవీంద్ర వారధిగా నిలిచిన కథలివి. మనిషి బతికేందుకు బుక్కెడు బువ్వ గుక్కెడు నీరే కాదు గుప్పెడు మానవత్వం కావాలని, అది లోపించిన నాడు మనిషి మరుగుజ్జు అయిపోతాడని చెప్పే కథ 'మరుగుజ్జు'. అవును మనిషికి మనిషికి మధ్య మతపు గోడలు మొలిస్తే, ఆదుకున్న చేయికి ఆసరా అందించలేకపోతే మానవత్వానికి విలువేముందని ప్రశ్నిస్తాడు రచయిత.

వెన్నెలని, తేనెను, పసిడిని కరిగించి, ప్రకృతి సౌందర్యానంతటినీ అందులో కలిపేసి, అపూర్వంగా బ్రహ్మ సృష్టించినట్లున్నాడు మెరుపుతీగ అందినట్లే అంది, అందకుండా పోవడంలోని విషాదాన్ని అకస్మాత్తుగా ఎదుర్కోవాల్సి వస్తే, చల్లని వెన్నెల, చలువ చందనం కూడా మంటలను రేపుతుంది. **'వెన్నెల మంట"**లోని కావ్య జీవితాన్ని చదువుతూంటే కథకుడి గుండెలే కాదు పాఠకుడి గుండె కూడా బరువెక్కి విశ్వసిస్తుంది. ఉత్తర భారతానికి చెందిన రాజేంద్ర యాదవ్ భార్య, చనిపోయే ముందు తనకు ఏమీ కాని ఆనంద్‌లో తన కొడుకును చూడాలనుకుంటుంది. సమయం కాదన్న భార్య ఆక్షేపణతో ఆగిపోతాడు ఆనంద్. రాజేంద్ర భార్య చివరి కోరిక తీర్చలేకపోతాడు కాని అతనిచ్చిన గంగాజలం 'చావు'ను శుద్ధి చేయటానికి పనికివస్తుంది. ఆనంద్ భార్యలాంటి మనందరి నమ్మకాలను, మూఢ విశ్వాసాల మధ్య పోగొట్టుకున్న మానవత్వాన్ని ప్రశ్నిస్తుంది ఈ కథ. చుట్టూ అల్లుకున్న ఉక్కుతీగలపై పాఠకుడికి ఏవగింపు, ఆనంద్ పాత్రపై సానుభూతి– ఈ రెండూ ఏకకాలంలో కలిగేలా కథను అల్లటంలో రవీంద్ర చూపిన నైపుణ్యం అసమానం!

దేహం ఉన్నాక శారీరక ఆకలి, మనసనేది ఉన్నాక మానసిక ఆకలి, సహజం. అవి నలుగురు మెచ్చే పద్ధతుల్లోనే తీరాలని చెప్పే **"మమజీవన"**.

మిగతా కథలన్నింటా, ఇదే శైలీ శిల్పము పాఠకుడిని ముగ్ధుడిని చేస్తుంది. కథ కథనం శైలి శిల్పం– అన్నీ సమపాళ్ళలో సరికూడిన ఈ కథల్లోని క్లుప్తత, మరియు ప్రతీకాత్మకతలు ఆకట్టుకుంటాయి. సుఖాంతం అయిన **'..మమజీవన'** కథలో స్వప్న బుగ్గల్లాగే ఆకాశం ఎర్ర బడిందట! ఉపమానం ఉపమేయంగా మారిందిక్కడ.

జీవిత కాలపు కలల పంట అయిన ఇంటిని కొత్తగా వేస్తోన్న మోనో రైలు మార్గానికి అడ్డం వస్తుందని కూల్చాలన్న ప్రభుత్వ ఆదేశాలతో.. ఆ ఇంటి కాంపౌండ్ గోడేకాదు, రాజేశం గుండె అనే "మరో గోడ" కూలిందంటాడు రచయిత.

పరుగెత్తే 'పట్నం'లాంటి సత్యం, నిలకడగా నిదానంగా నడిచే పల్లెటూరు లాంటి చిలకమ్మను పెళ్ళాడి బొంబాయి తెచ్చుకుంటాడు. కోరికల గుర్రాల వెంట పరుగెడుతోన్న సత్యాన్ని చిలకమ్మ ఎన్నో సందర్భాల్లో వారిస్తుంది. నేలమీదే కాళ్ళున్చి నడవమంటుంది. కాని సత్యం వినడు. ఆయన అత్యాశకు చిలకమ్మ బలి అవుతుంది. రవీంద్ర కథను ఇక్కడే ముగించక సత్యం రేపటి వెలుగువేపు ప్రస్థానించాలని నిశ్చయించుకోవటం బావుంది. మనిషి ఆశాజీవి. ఆయన ప్రస్థానం వెలుగుల వేపు సాగాలి. చీకట్లోనే కొట్టుమిట్టాడినట్లు ముగించక రవీంద్ర.. ఒక గొప్ప సందేశాన్ని, సాహిత్యానికి అర్థాన్ని చెప్పాడు.

చక్కని సందేశం, కథ కథనం అన్నీ సమపాళ్ళలో రంగరించి అందిస్తున్న, సంగెవేని రవీంద్ర కథలు, పాఠకులు తప్పక చదవాలి. మానవ విలువల విధ్వంసాన్ని రచయిత చెబుతున్నట్లుగా విరమించుకోవాలి. ఇట్లాంటి మంచి కథలు ఇంకా రావాలి. అక్షరమక్షరంలోనూ మానవత్వం, మంచితనం నింపుకున్న కథలివి.

'ఒక మంచి కథకు నిర్వచనం ఏమిటి?" అన్న ప్రశ్నకు సూటిగా జవాబు చెప్పటం కష్టం.

*ప్రతులకు: సంగెవేని రవీంద్ర*
*సి.వి. కాంపౌండ్, 7/4, హనుమాన్‌లేన్*
*లోయర్ పరేల్ ముంబయి–400 013*
*మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో..*



–కూర చిదంబరం
సెల్: 8639338675

రాతలు( మాటలు చెప్పడం)
చేతలు( ఆచరణలో చూపడం)
ఒకటే అయినపుడు
జీవితం అత్యద్భుతం.
అదే జీవన మకరందం...
-మునిమడుగుల ఫిలాసఫీ
సెల్:7013577140

## నేను సాగరాన్ని

నాకంటే
నేను పెట్టిన చెట్లు
ఆకాశమెత్తు ఎగరటం ఎంత ఆనందం.

కొన్ని చెట్లు పూలు పూస్తున్నాయి
కొన్ని చెట్లు పండ్లు యిస్తున్నాయి
కొన్ని చెట్లు చల్లని గాలి నిస్తున్నాయి
కొన్ని చెట్లు తన చుట్టూ
తోటనే పంచుకున్నాయి.

గర్వంగా వుంది
నేను పెట్టిన చెట్లు
కోయిల పాటలు పాడుతుంటె
కవిత్వం ఆకాశాన్ని మురిపిస్తుంటె
ఎంత ఆనందం
నేను నాటిన
పూల తీగె
నా ఇంటి గోడచుట్టూ అల్లుకుంది
నావాడ గుండెల్లో సువాసన లిస్తున్నాయి
సంతృప్తి– సంతోషం
సాగర గుండెల్లో నిల్చింది
ఈ చెట్లునాకు ఫలాలివ్వకున్నా పర్వాలేదు
పూలు నాకు అందించకున్నా అసూయలేదు
నాకు నీడ నివ్వకున్నా సంతోషమే...
నన్ను గుర్తిస్తున్నాము
ఈ ప్రశ్నే వద్దు
నేను సాగరాన్ని.



– సి.హెచ్. మధు
9949486122

పుస్తక సమీక్షలు

# కవన క్షేత్రంలో గట్టి విత్తనాలను విత్తుతున్న రాఘవేంద్ర

బాల బాలికల్లోని సృజనాత్మక శక్తిని గుర్తించి వారిచే కవితలు, కథలు అల్లించి సంకలనాలుగా వెలువరించడం ఈ రాఘవేంద్ర ప్రవృత్తి. బాల సాహిత్యంపై ఈ తెలుగు ఉపాధ్యాయుడికి అంత మక్కువ. యిదివరలో తన పాఠశాల విద్యార్థినీ విద్యార్థులచే నీతి ప్రబోధక చిట్టి, చిట్టి కథలు రాయించి **'ఆకాశంలో నెమలిక'** పేరిట ఓ సంకలనం వెలువరించాడు. నేను సమీక్ష రాసినట్టు గుర్తు. అంతకు ముందు పాఠశాల విద్యార్థులచే కవితలు రాయించి ఓ సంకలనం వెలువరించాడని విన్నాను. భవిష్యత్తులో రూపుదిద్దుకోబోతున్న గొప్ప, గొప్ప కవులకు, కథకులకు పునాదులు ఏర్పరుస్తున్నాడన్న మాట. రాఘవేంద్ర స్వతఃహాగా కవి. రాయలసీమ రైతుబిడ్డ. కరువు అనుభవం, ఆకలి విలువ తెలిసిన వాడు. రైతు గోసను ప్రత్యక్షంగా వీక్షించినవాడు. రాయలసీమలో నీటి చుక్కకు నోచుకోని రైతు పొలాల్లో మొలకెత్తని విత్తనాన్ని 'గాయపడ్డ విత్తనం'గా అభివర్ణిస్తున్నాడు. యిక్కడ విత్తనం అంటే చిరునవ్వులు చిందించలేని రైతు కూడా. ఒకప్పుడు రైతు పరిస్థితి ఏమిటి?

**"నెత్తిక రుమాలు**
**మోకాలి కిందికి పంచెతో**
**అచ్చం మావూరి మొదల్లో**
**నిండైనా కొండలా వుండేవాడు"** మరి యిప్పుడు?

**"ఇప్పుడు తాను**
**చీకటి కార్చిన కన్నీరు**
**రెండు తలుపులు గీసుకున్న శబ్దం**
**చుక్క నీరు లేక**
**చెరువు పగుళ్ళు దేలినట్లున్న**
**ఆదేహం/ ఈ దేశం చిరునామా!"**

రెండు కళ్ళనుండి కారే కన్నీరు నిశ్శబ్దంగా శబ్దిస్తోందట! గొప్ప భావుకత.

తమని ఎవరైనా ఆదరిస్తారేమోనని కొండంత ఆశతో వినతి పత్రాలతో పాలకుల ముందు మోకరిల్లుతారు.

**"ఆ పత్రానికి ఒక మనసుంటుంది**
**ఆ అక్షరాలు కూడా మాట్లాడతాయి"**

నిజమే.. మూగభాష కదా! కన్నీటి జల్లులతో తడిసిన అక్షరాలు గదా! ఎవరు పట్టించుకుంటారు? రాతి గుండెలు చెమర్చేదెప్పుడు?

**"కళ్ళెదుటే కాగితపు జలాలు**
**నదీ రోడ్డులో ప్రవహిస్తుంటాయి**
**ఏ గుండెలు పారేసుకున్న అక్షరాలో**
**వడి వడిగా మట్టివాసన వెదజల్లుతుంటాయి"**

నిర్లక్ష్యానికి గురైన విన్నపాలు చెత్తబుట్టల్లో దాఖలయ్యే వైనాన్ని ప్రతీకాత్మకంగా చెప్పిన పంక్తులు.. గుండె లోతుల్లోంచి పెల్లుబుకిన అభివ్యక్తులు.

వీధి దీపాన్ని (సోలార్) ఎలా వర్ణిస్తున్నాడో చూడండి.

**"పగలంతా భానుడు పోసిన వెలుతురు తాగి**
**రాత్రి సూరీడై నిలబడి దారిలో కాసింత**
**అమృతం జల్లేది"**

మామూలు వస్తువుని గూడా కొత్తగా చూడటం, కొంగ్రొత్తగా వ్యక్తీకరించడం కవిత్వ శక్తిని ఎత్తి చూపుతుంది. కవిత్వాన్ని కవిత్వంలా రాయగల శక్తి రాఘవేంద్రది.

ప్రపంచీకరణ నేపథ్యంలో పల్లెలు కనుమరుగవుతున్నాయి. ప్రయోగాలు పేరిట ధ్వంసానికి గురవుతున్నాయి. పట్టణాలు పల్లెల్ని ఆక్రమిం




చేస్తున్నాయి.

**"ఇవాళ నా పల్లె**
**అదృశ్య శక్తులు వాడుకునే ఓ ప్రయోగశాల**
**నేల, స్పర్శను చిగురించని ఒక శిల**
**రైతు, శిథిలమైన ఒక చరిత్ర"** సింహభాగం కవితలు రైతు వెతలకే కేటాయించాడు. రైతు పక్షపాతి రాఘవేంద్ర.

**"రెండు అక్షరాలే అనుకుంటాం**
**మాట తూలితే తూటాను పేల్చినట్టే"** అన్నాను నేనో కవితలో..

మాటని ఎదుటివాడి మీద విసిరిన రాయితో పోలుస్తున్నాడు రాఘవేంద్ర.

**"నీళ్ళల్లో తటాలున రాయిపడింది**
**రాయి అలజడిని సృష్టించానని**
**సంబరపడింది**
**మదిలో గుచ్చుకున్న మాటలా**
**నదిలో రాయి నిలబడిపోయింది"** మాట విలువే కాదు. అక్షరాల పదునూ ఈ కవికి తెలుసు. కలాన్ని బలంగా పలికించగల ప్రతిభావంతుడు.

**"గొంతుకు తూటాల గోడలు కట్టి**
**నీ ఆటలు సాగించాలనుకుంటున్నావు**
**వేల గొంతులు సర్వం సర్దుకుంటున్నాయి"**

అంటు గౌరీలంకేష్ హత్యపట్ల తీవ్రంగా స్పందించిన కవికి పాకీడు, చర్మకారుడు, కల్లుగీత కార్మికుడు అనేక శ్రమ జీవులు కవితా వస్తువులైనయి. బాధ్యతా రహితమైన పాలకుల నిర్లక్ష్యాన్ని సూటిగా ప్రశ్నిస్తు కవితల్ని అస్త్రాలుగా మలిచి సంధించాడు. తొలి ప్రయత్నంలోనే మంచి కవిత్వాన్ని అందించిన రాఘవేంద్ర భవిష్యత్తులో గొప్ప కవిగా ఎదుగుతాడని నా నమ్మకం.

ప్రతులకు: టి. హారిక
7–1–17, ఫోర్ట్ గేట్ దగ్గర
రాయదుర్గ్–515 865
అనంతపూర్ జిల్లా
సెల్: 9494074022



– రమణ వెలమకన్ని
సెల్: 9704158488

# రచయిత సమాజహితమే "ఆరాటం" నవల: డా॥ నందిని సిధారెడ్డి



పుస్తకావిష్కరణలో డా॥ఏనుగు నరసింహారెడ్డి, డా॥ నాళేశ్వరం శంకరం, ఆవిష్కర్త డా॥ నందిని సిధారెడ్డి, రచయిత దారం గంగాధర్, దంపతులు, బైస దేవదాసు, డా॥ పోరెడ్డి రంగయ్య, శంకర్.



**రచయిత గంగాధర్ దంపతులను సత్కరిస్తున్న అతిథులు.**

సమాజ హితం, ఏదో విధంగా సమాజానికి మేలు చేయాలన్న ధ్యేయంగా రచయిత ఆశయం, ఆలోచనలు ఈ "ఆరాటం" నవలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డా॥ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో తేజ ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ రచయిత దారం గంగాధర్ రచించిన 'ఆరాటం' నవల ఆవిష్కరణ సభ ఘనంగా జరిగింది. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డా॥ నాళేశ్వరం శంకరం సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి, నవల ఆవిష్కర్తగా డా॥ నందిని సిధారెడ్డి, విశిష్ట అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ ఏనుగు నరసింహారెడ్డి, నేటినిజం సంపాదకుడు బైస దేవదాసు పాల్గొనగా పుస్తక పరిచయకర్తగా ప్రముఖ విమర్శకుడు కె.పి. అశోక్‌కుమార్ వ్యవహరించారు. ముందుగా సభకు తేజ ఆర్ట్ క్రియేషన్స్ అధ్యక్షుడు డా॥ పోరెడ్డి రంగయ్య స్వాగతం పలికారు. అనంతరం ముఖ్య అతిథి డా॥ నందిని సిధారెడ్డి తదితర అతిథుల చేతుల మీదుగా నిజామాబాద్ పట్టణానికి చెందిన రచయిత దారం గంగాధర్ రచించిన 'ఆరాటం' నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహణ సంస్థ తేజ ఆర్ట్స్ తరఫున నవల రచయిత గంగాధర్ దంపతులను అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అనంతరం డా॥నందిని సిధారెడ్డి మాట్లాడుతు సమాజంలో ఉండే చెడు మీద మంచి సాధించేటటువంటి విజయం ఆయన కథలు, నవలల్లో చిత్రీకరించబడి ఉన్నాయన్నారు. మహాత్మాగాంధీ కోరుకున్న దానిలో గ్రామ స్వరాజ్యం చాలా కీలకమైందని, గ్రామం స్వరాజ్యంతో ఉంటే దేశం తప్పకుండా స్వరాజ్యంతో ఉంటుందని, గ్రామం సంక్షేమంగా ఉంటే దేశం కూడా సంక్షేమంగానే ఉంటుందని, పల్లె తల్లిలాంటిది, పట్నం ప్రేయసి వంటిదన్నారు. రచయిత దారం గంగాధర్‌కి పల్లెమీద ఉన్న మమకారమంతా ఈ నవలలో కనబడుతుందని చెప్పారు. పల్లె నుండి మాయ, మోసంతో నిండివుండే నగరానికి వలస వచ్చిన వ్యక్తి ఎదుర్కొనే సమస్యలు, కష్టనష్టాలతో కూడిన ఆయన జీవితాన్ని ఈ నవలలో రచయిత అత్యంత అద్భుతంగా చిత్రీకరించారని నందిని సిధారెడ్డి రచయిత గంగాధర్‌ను ఎంతగానో అభినందించారు. పల్లెటూరిపై వున్న మమకారంతో సమాజంపట్ల ఉన్న ఆరాటాన్ని అక్షరీకరించడం అభినందనీయమని సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఆలస్యంగా రచనలు చేసినా యాడదిన్నర కాలంలో రెండు కథల పుస్తకాలతో పాటు ఈ రోజు ఒక నవలను రాసి విడుదల చేయడం చూస్తుంటే ఆనందంగా వుందని, గంగాధరంకు మంచి భవిష్యత్తు వుందని అన్నారు.

అన్నిరంగాల్లో జరుగుతున్న దోపిడీని, అధికార దుర్వినియోగాన్ని ఈ 'ఆరాటం' నవలలో రచయిత దారం గంగాధర్ సవివరంగా తెలపడం, రోజూ సమాజంలో జరుగుతున్న సంఘటనలు జ్ఞప్తికి వస్తున్నాయని సీనియర్ జర్నలిస్టు బైస దేవదాసు అన్నారు. డా॥ నాళేశ్వరం శంకరం అధ్యక్షోపన్యాసంలో తెలంగాణలో కూడా మంచి నవలా రచయితలున్నారనడానికి దారం గంగాధర్ రచించిన ఆరాటం నవల ఒక నిదర్శనమన్నారు. కె.పి. అశోక్‌కుమార్ పుస్తక పరిచయం చేస్తూ నవలలోని ప్రతి అంశం సవివరంగా తెలిపి ఆకట్టుకున్నారు. చివర రచయిత దారం గంగాధర్ తన స్పందన వినిపించారు. పోరెడ్డి రంగయ్య వందన సమర్పణ చేశారు.

## భ్రమణం

రచన: నటన–జీవితం
కాలచక్రంలో ఇదొక కళాచక్రం
కాగితానికి రంగులద్దితే
అది రచనకు ముఖచిత్రం
ముఖానికి రంగులద్దితే
నటనకు నాందీ ప్రస్థానం
భావాన్ని–అర్థం, వాక్యాలతో
అక్షరీకరిస్తే అది రచన
రచనని ఆహార్యం వాచికంతో
ఆంగీకరిస్తే అది నటన
రచన అక్షర యజ్ఞం
నటన చాక్షుష యజ్ఞం
రచన పద్యం కాదంటే గద్యం
నటన నవరసాల సేద్యం
నటుడైనా, రచయితైనా
కుటుంబం, సమాజంతో
కలిసి జీవిస్తే అది భద్రం
విస్మరిస్తే బతుకు ఛిద్రం
సామాజిక ప్రయోజనం
లేని రచనగాని నటనగాని
గగనానికి కొట్టుకుపోతుంది
దారం తెగిన గాలిపటంలా
అది ప్రయోజనకారి అయితే
భవనంపై నిలబడుతుంది
దేశపటంలా



– జ్యోతిరాజ్ భీశెట్టి
99853 98889

## బడివోతనంటది బుజ్జాయి

బడి వోతనంటది బుజ్జాయి
పొరలింటదట చిన్నారి
పోనివరెందుకో కన్నోలు
పోతనంటు పింకిమారమే
బడిగావాలంటుంటె బతుకుదెరువంటరె
కూలి వంపి కొత్తలెంచుతరె
బావి పౌరులెట్ల బాగుపడెది
బడి పంతులే దెలుపు బతుకుదెరువురా
బడివోనోల్ల బతుకు, బాగోగు లేదుర
బడివొతనంటెనువు అడ్డుకోకుర
పంతుల్ల పాఠలు పొల్లువోవురా
కాని–పోని కూలి వంపకూ
కూలి కొత్తలెంత కూటికి
పంతుల్ల పాఠలె మంచికి
రెక్కలెగర నేర్పు పంతుల్లు
నింగితాకి తీరు ఆ ఆశలు
రాబోవు కష్టాలు ఎదిరించ దెల్పురా
సాహసమే సదువు
గురువు నేర్పురా
గురువుకు కానిది ఏదిలేదుర
గురువు త్రిమూర్తుల సంగమమంటారు
కన్నోల వెనకాలె కన్నంత విలువర
బడి వోతనంటె నువు అడ్డుకోకురా
బడి వంపి బాగోగు నేర్పురా
బడి పిల్లలె గద బావి పౌరులు
బడి పిల్లలె గద బావి కళలు.

– ముమ్మడి శశిధర్‌కుమార్
9–84/5, ఫ్లాట్ నెం. 25,
సాయినగరు, దస్నాపూర్
ఆదిలాబాద్–504 001

## నేనెరిగిననా!?

స్వార్థం కూడదన్నాడు
పరార్థాన్ని యోచించమన్నాడు
జీవితమంటే!
కాకిలా కలకాలం కాదు
హంసలా ఆర్నెల్లు చాలన్నాడు
జీవించడం కోసమే భుజించమన్నాడు
చరితంటే!?
నీవు గతించినా నిలవాలన్నాడు
అపుడే జీవితానికి
ఆచంద్ర తారార్క యశస్సన్నాడు
వెరసి నీతిగా జీవించమని
పరోపకారంతో బ్రతకమని
అస్థిర జీవితానికి
అందని ఆశలు కూడదని
ఉన్నదానితోనే సంతృప్తి
భగవాన్ ధ్యాసలోనే
జీవన పురోగతంటూ
సుద్దులెన్నో నేర్పి
జీవన హద్దుల్ని తెల్పి
క్రమశిక్షణ కల్గిన జీవితమే
సదా పురోగతికి సోపానమని
అక్షరమై నిలిచినవాడు
నక్షత్రమై మెరిసినవాడు
ఎనలేని కీర్తిని బడసిన వాడు
నేడందుకే గగనానికెగసినా
తాను మాత్రం చిరంజీవియై!
మా మదుల్లో నెలకొన్న పెన్నిధి
మా అందరి సన్నిధి
నేనెరిగిన నా పితృదేవుడు!



– దోసపాటి సత్యనారాయణమూర్తి
9866631877

## ఎన్నీల ముచ్చట్లు

"ఎన్నీల ముచ్చట్లు"
ముద్దవెన్న ముచ్చట్లు
ముద్దబంతి పూల ముచ్చట్లు
కవి కోయిలల రాగాల ముచ్చట్లు
ఒక్కోక్క అక్షరం
ఒక్కొక్క పూవు
ఒక్కోక్క అక్షరం
ఒక్కోక్క కవిత
అక్కోక్క అక్షరం
ఒక్కోక్క మహాగ్రంథం కావాలి.

"చీకటిని పారద్రోలాలి"
కాంతిని విరజిమ్మే సిరిబుడ్డి
ముచ్చట్లు కావాలి
ఒక్కోక్క కవి
సంఘ సేవకుడు కావాలి
ప్రశ్నించే వీరుడు గావాలి

"నల్లమల అడవుల గురించి"
ఎండగట్టాలి
గుట్టలు కరుగుతున్నవి
బండలు పిండైతున్నవి
యురేనియమని పచ్చని అడవుల్లో
మంటలు లేపుతుంద్రు
ప్రతిగుట్టను పేకిలిస్తుంద్రు
ప్రతిబండను అమ్ముతుంద్రు
గ్రానైట్ మాఫియా రాజ్యమేలుతుంది
అమాయకులను
తాగుడుకు బానిసలు జేస్తుంద్రు
మద్యం రాజ్యమేలుతుంది
ఎన్నీల ముచ్చట్లు
ఎంత కాలం పేదలకష్టాలు.



– మియాపురం
శ్రీనివాస్‌పూడూర్

## ప్రకృతి

ప్రకృతికి ఆహ్లాద గుణం
ఎంత వరించి వుందో
ఋతువుల కాల చక్రానికి
అనుగుణంగానే దాని
ప్రవర్తనా వళి.

తరువులు దొరువులు
కొండలు కోనల సెలయేరులలో
ప్రకృతి మార్పులు
మానవాళి మనుగడలో
ఒక భాగమై
సూర్య చంద్రాదులు సైతం
వారి గమనా గమనాలు
ప్రకతికి ఆధీనమై
సృష్టి స్థతి లయలకు
కారణ జన్మమైనది
ఇల వెలసిన ప్రకృతి
సౌందర్య వతి.
ప్రకృతి ఆగమనం
మానవాళి మేధస్సుకు
అందనిదైనది దాని ఉనికి.
యుగ యుగాలు
తరతరాలు మారుతువున్నా
విరామ మెరుగక
తన పనిలో తానే
నిమగ్నమై వున్నదే ప్రకృతి.



–దూబగుంట రామకృష్ణ
965 202 1126

## ఊగిసలాట??

ఒక్క అడుగే కదాని నీరసించి
నిష్క్రమించకు
అడుగు వెనుక అడుగుతో
ఖగోళమంతా
కౌగలించుకోవచ్చు

ఒక్క నీటి చుక్కే కదా అని
చులకనగా చూడకు
ఆ వర్షపు బింధువులే అఖండ
సింధువవును ఆవిష్కరిస్తాయి.

వెలిగించాలనుకునే దీపం
ఒక్కటే అని వెనకడుగువేయకు
అది లక్షల చీకటి జీవితాల్లో
వెలుగునింపే జీవనజ్యోతి
నా ఒక్క చెయ్యే చేయూత
నేమిస్తుందని అనుకోకు
నీ చేయి వెంట వేల చేతులు
చైతన్య దివిటీలై వెలుగులు నింపుతాయి.

సమాజం పట్ల...
నాకేం పట్టిందని నిస్పృహతో
నిర్లక్ష్యం వహిస్తే
పుచ్చిన సమాజం నిన్ను
నిలువునా దహించివేస్తుంది
జాగ్రత్త!



–కొప్పోలు యాదయ్య

# వేజారిపోని "సబ్బు బిళ్ళ"






ఏ విషయమైనా మనం కవిత్వీకరించేటప్పుడు పదిమందికీ అర్థమవ్వాలనేదే డా॥ రావి రంగారావు గారి కవితా నిర్దేశం. కష్ట తరమైన పదాలు, భారమైన భావాలు, మోయలేని అభివ్యక్తీకరణలు అవసరం లేదంటారు. కానీ వీరి కవిత్వంలో వ్యంగ్యం ఎక్కువగా ఉంటుంది. ఒక విషయాన్ని సూటిగా కాకుండా నర్మగర్భంగా చెప్పాలనేదే వీరి సూత్రం. రావి రంగారావుగారి కవిత్వం దాదాపుగా సరళంగా, సునిశితమైన వ్యంగ్యాన్ని తోడు తెచ్చుకుని వుండటం గమనిస్తాము. వ్యక్తి వేరు, కవిత్వం వేరు అనేదే వీరి సిద్ధాంతం. వ్యక్తికి దూరమైనా కవిత్వానికి పట్టం కడతారు. అలాగే కవిత్వంలో కవితా ఛాయలు కనిపించకపోయినా వ్యక్తి గౌరవానికి భంగం కలుగకుండా ప్రవర్తిస్తారు. నేటి ఈ కవితా సమాజంలో ఈ లక్షణాలు ఎక్కడా కనిపించవు. వీరి కవిత్వం దాదాపు అన్నీ సూటిగా వుంటాయి. ఎక్కడా పదాల మధ్య తొట్రుపాటు గానీ, వస్తువు వద్ద సంశయం కానీ కనిపించదు. వారు అనుకున్నట్లుగా రచించడమే వీరి నైజం.

ఇపుడు నా ముందు వీరి మినీ కవితలు **"సబ్బుబిళ్ళ"** ఉంది. మినీ కవితా పితామహుడు అని పేరుగాంచిన వీరు మినీ కవిత్వాన్ని వీరు రాయడమే కాకుండా ఎందరో యువకుల చేత రాయిస్తున్నారు. ఎక్కడ మినీ కవిత్వం కనిపించినా ఆదరిస్తారు. మినీ కవిత్వానికి ఒక ప్రత్యేకమైన గొంతు ఉన్నట్లు తెలియజేసిన కవి వీరు. సామాన్యుడి వాహనమైన సైకిల్‌తో జీవితాన్ని పోల్చుతు వీరు రచించిన **"అనుబంధాలు"** అనే మినీ కవితలో **"ఎక్కి/ తొక్కుతుంటే / చైను/ తెక్కుండా చూసుకోవాలి/ జీవితం ఓ సైకిల్"** అంటారు. బతుకు బండిలో ఎక్కడా లింక్స్ తెగకూడదు అనే అర్థం వచ్చేలా చెప్పిన ఈ మినీ కవిత అర్ధవంతంగా వుంది. అలాగే

**"రాహుకాలం/యమగండ కాలం/ రాత్రికి కాదు/ ఎప్పుడైనా పగలుకే/ కష్టాలూ అంతే/ ధీరులకే!"** అనే కవిత చదువుతుంటే కష్టపడుతున్నవారందరికీ ఊరటగా ఉంటుంది.

**"దేవుడా! / భూములూ.. కంపెనీలూ..!/ ఏవీ నాకివ్వద్దు/ ఒకరోజు ఓటరును/ మాయ చేసే /వరమివ్వు"** అనడంలో ఎంతో లోతైన భావం వుంది..."**దీపావళి అయిపోయింది/ వెలుతురు లన్నీ వెలిగి ఆరాయి/ తెల్లారే సరికి/ బూడిద మిగిలింది/ఎన్నికలైనాక/ ప్రజల బతుకుల్లాగ"** నర్మగర్భంగా నేటి ప్రజల తీరును ఎండగట్టే ఈ కవితలో వ్యంగ్యం ఉంది. దానితో పాటు వాస్తవం ఉంది. జాతిలో పరిపూర్ణత కమ్ముకుని శూన్యత కనిపించకూడదనే భావన ఇందులో ఉంది.

రావి రంగారావు గారి మినీ కవితలైనా, వచన కవితలు ఏవైనా అందులోని వస్తువు నీతి నిజాయితీని కోల్పోతున్న అధికారాల గురించే దాదాపుగా ఉంటాయి. అవినీతిని పెంచి పోషిస్తున్న రాజకీయాలపైనే ఉంటాయి. మనిషి నిత్యం తనను తాను పోగొట్టుకోకూడదనే ఆలోచనలోనే ఉంటాయి. నిబద్ధత, నియమం లేకుంటే జీవితాలు ఎంత అస్తవ్యస్తమవుతాయో అని తెలిపే హెచ్చరికలు ఉంటాయి. ఎందుకంటే వీరు స్వచ్ఛమైన కవి. అలాగే వాస్తవాల్ని కాచి వడబోసిన వ్యక్తి.. ఉదాహరణకు ఒకటి మానవీయతను చాటిచెప్పే మినీ కవిత మచ్చుకి మీకోసం " లైంగిక వేధింపుల/ కేసులో అరెస్టట/ అవును మరి../ఆయన/ జంతుశాస్త్రం ప్రొఫెసరు" రాజకీయంగా **"కన్ను తెరిస్తే చీకటి/ కన్నుమూస్తే చీకటి/ రెప్పపాటయితే బావుణ్ణు/ ఈ 'కరెంట్' ప్రభుత్వం!"** మరొకటి **"గాంధీ బాబుల కన్న/ బ్రాందీ షాపులే నయం/ ఏడాది కో నాడైనా/ కాస్తో కూస్తో కళ్ళు మూసుకుని/ గాంధీజీని స్మరిస్తాయి"** లాంటి చమక్కులు అనేకం ఈ గ్రంథంలో. కవిత్వాన్ని కవిత్వంలా ప్రేమిస్తూ వీరితో పాటు మరొక వందమంది చేజారిపోలేని సబ్బుబిళ్ళల రూపంలో మంచి కవిత్వం అందివ్వాలనే ఆశయంతో ముందుకు నడుస్తున్న రావి రంగారావు గారికి అభినందనలు.

ప్రతులకు: నర్రా. ప్రభావతి
ఫోన్: 9247581825

పుస్తక సమీక్ష

# అలరించిన "మాధవ మందారాలు"






దాదాపు 20 దాకా అనేక ప్రక్రియల్లో ముఖ్యంగా గీత రచనలు రచించి, పేరెన్నిక గన్న కవి మాధవరావు కోరుప్రోలు గారు. వీరి వృత్తికి, ప్రవృత్తికి ఎంతో వ్యత్యాసం ఉంది ఎలాగంటే మిశ్రదాతునిగమ్, హైదరాబాద్‌లో క్వాలిటీ ఇంజనీర్ గా వృత్తిని నిర్వర్తిస్తూ, ప్రవృత్తిని ఇంత ప్రశంసాత్మకంగా సాగించడం అనేది విశేషమే మరి. . రెండు వేల ఆరు వందల గజళ్ళు రాయడం అంటే మాటలు కావు. సుమారు ఏడు సంవత్సరాలనుంచి రోజుకొక్క గజల్ చొప్పున రాయడం అంటే వీరు ఒక్కో గజల్ రచించడానికి ఎంతగా ఆలోచించారో అర్థమవుతుంది. తెల్లవారి లేస్తే వాట్సప్‌లో ఒక గజల్ ఉండాలనేది వీరి ప్రత్యేకం. పదిహేను పదహారు వేల షేర్లు..! అంటే మామూలు మాటలు కావు. నిజంగా ఒక తపస్సు చేసారనే ఒప్పుకోవాలి. వీరి గజల్ పంక్తులు కొన్ని...

ముందుగా మహాకవి సినారె పై రచించిన ఒక గజల్‌ను గమనించండి

**"కర్పూరపు వాసంతం.. కరిగిపోదు యుగాలైన../ తన పలుకుల మాధుర్యం../ వీడిపోదు యుగాలైనా/ "విశ్వంభర" తిలకమైన.. జ్ఞానపీఠ సౌందర్యం../ఆ అమలిన తత్వజ్ఞత. ..చెదరిపోదు యుగాలైనా"**

"ఎలా నిన్ను చేరాలో... తెలియకనే గొడవంతా..!/ ఎఱుకపూల వనములోన.. నిలువకనే గొడవంతా"// నటన సూత్రధారి ఎవరు../ ఉన్నదసలు నాటకమే../ పాత్రధారి పాత్ర సరిగ../ పట్టకనే గొడవంతా.."

**"ఆవేశపు ద్వారంగా.. మిగులనేల కలనైనా/ కల్మషాలు కాల్చగల్గు../ నవదీపం ఉందెక్కడ"**

**"గోపికలను వేధించడు.. వేద విధుడు మాధవుడు../ మౌనగీతి అతని గజల్.. వినిపిస్తే చిత్ర కాంతి"** వర్ణన బావుంది..

ఇలాంటివి ఈ గ్రంథంలో అనేకం. కవి ఋషి లాంటివాడు. నిత్యం కవికి ధ్యానించే హృదయం ఉంటుంది. ఈ గ్రంథంలో అనేకం ప్రేమయిక గజల్సే.. అసలు కవిత్వానికి ఖచ్చితంగా అతికేది ప్రేమ, ఆవేదన. అంటే ఇష్టం,కష్టం రెండూ ఒక స్థాయిని దాటినప్పుడు కలానికి పదును ఏర్పడుతుంది. ప్రేమ అనేది ఒక పవిత్రమైన భావనలా ఉన్నంతకాలం వాటిని అనుసరించి వచ్చే వాక్యాలన్నీ రమణీయంగా ఉంటాయి అని తెలిపే రీతిలో మాధవరావు గారు రచించిన గజల్స్‌ను చదివి ఆనందించకుండా ఉండలేము. మచ్చుకి **"కురుస్తున్న ప్రేమపూల వాన కదా గజలంటే../ ఒక వాడని నవ మల్లెల .. మాలకదా గజలంటే"** అనడం ఎంతో హృద్యంగా ఉంది. మాధవరావు గారు ఏదో ఉబుసుపోక రచించిన గ్రంథం కాదిది. ఎంతో హుందాగా రచించినది. మరిన్ని గజళ్ళు రచించాలని ఆశిస్తూ అభినందిస్తున్నాను.

ప్రతులకు: కోరుప్రోలు ఆండాళ్
ఫోను: 98669 95085

–శైలజామిత్ర
9290900879

## మాట వరసకి..

కీర్తి–
అది నా చెప్పుకింద నలిగిన
మట్టి
చెప్పుకింద నలిగినందుకు కాదు
అది మట్టి కాబట్టి తలదాలుస్తాను
కీర్తి కండూతిని ఒళ్ళంతా పట్టించుకున్న వాళ్ళని
నా గుడ్డికన్ను సైతం రెప్పెత్తి చూడదు
సముద్రంలో వేలమైళ్ళు
ఉత్సాహంగా పరిగెత్తి వచ్చిన కెరటం
కీర్తిని కోరుకుంటే ఏమౌతుంది?
జనావాసాలు సముద్రంలో
సముద్రం జనావాసాల్లో కాపురం చేస్తాయి
గాలి గొప్పతనం చాటుకోవటం కోసం
క్షణకాలం స్తంభించిపోతే
ప్రపంచం సరే
గాలికూడ మరణించినట్టే లెక్క
ఇప్పటికిప్పుడే నిప్పుల కొలిమై
భూమ్మీద దాడిచేస్తున్న సూర్యుడు
మరికాస్త ప్రతాపం చూపాలనుకొంటే
సమస్త ప్రపంచం అడ్రసు గల్లంతే!
ఇప్పటికీ మునిగిపోయిందేం లేదు
గొప్పలకి పోయి చేతికి మట్టి అంటుతుందన్న
మురికి ఊహను తొలగించుకోండి
మట్టి తవ్వి విత్తునాటండి
దోసెడు నీళ్లుపోసి
మీ మనవడిలా పెంచండి
ప్రాణవాయువు–
రేపటి మీ మనవడి అవసరం కదా!



– గుర్రాల రమణయ్య
సెల్: 996321943

## ఆకుపచ్చ అమ్మను.. మాట్లాడుతున్న!!

ఉదయం నడక నుండి
రాత్రి పడక దాకా
నా నీడ కోసమో నా గాలి కోసమే
భూమికి పచ్చని రంగేసినట్లుండే
నా పచ్చదనం కోసమో పరితపించే
బిడ్డలారా నేను మీ 'ఆకుపచ్చ'
అమ్మను మాట్లాడుతున్న!

నా కడుపున పుట్టినోళ్ళు
కొందరు కవులై.. కళాకారులై
నాపై కవిత్వం రాస్తున్నప్పుడు
పచ్చని చెట్టునురా.. ప్రగతికి మెట్టునురా
అంటూ జపం చేస్తున్నప్పుడు
తన్మయంతో పరవశించి పోతున్నా..

నా పచ్చిక బయళ్ళ మీద
నాట్యం చేసే నెమళ్ళ అందాలను
చెంగు చెంగున గెంతే కుందేళ్ళ
చిందులను పక్షుల కిల కిలా రావాలను
సెలయేళ్ళలో పారే నీటిగలగలల్ని
అడవి ఆదివాసీ నృత్యాలను... గిరిజన
గోండు చెంచు ఎల్లంబుల విన్యాసాలను
వీక్షించే పర్యావరణ ప్రేమికులారా
నేను ఆకుపచ్చ అమ్మను మాట్లాడుతున్న...

అమెజాన్ అడవుల నుండి
నల్లమల గుట్టల దాకా
ఇప్పుడెవరో.. ఆకుపచ్చ
అడవుల్ని ఆగం చేయడానికి
ఆదివాసీల్ని అడవుల నుండి
పులులు జింకలు, లేళ్ల నెమళ్ళు
సమస్త జీవావరణాన్ని
"గ్రీన్‌హంట్"లో వేటాడుతుండు
ప్రకృతిని చెరబడుతున్నారు!
హరితహారం, స్వచ్ఛ భారతుల్లో
మొక్కను నాటడమంటే
భవిష్యత్తును పెంచడమనుకుంటే
"పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు కాదు
బహుళజాతి దోపిడికి తాకట్టు"గా
ఇప్పుడు నా వళ్ళే నా భూగర్భాన్ని
నాలుగువేల బోర్లతో
పచ్చని పల్లెల్ని డెబ్బైవేల జనం
బతుకుల్ని–నల్లమలలో యురేనియం కోసం
నా పచ్చని బతుకుకు ఉరిపెడుతున్నారు
కొడుక్కా! నేను మీ ఆకుపచ్చ అమ్మను
మాట్లాడుతున్నా!!

వాడికెట్లా తెలుస్తుంది?
అడవితో ఆకుపచ్చ అమ్మతో మీ అనుబంధం...

ఇక్కడి నదుల్లో సెలయేళ్ళలో పారే నీళ్లు
మా పూర్వీకుల నెత్తురూ– చెమటని...
యుసిల్‌కేం తెలుస్తుంది–అడవిలో ఆదివాసీతో
పాటు ఆకులు అలములు, ప్రకృతి సంపదను
తాకట్టు పెట్టి అమ్ముకోవడం తప్ప...
ఇక్కడ నడయాడే సమస్త జీవకోటితో పాటు
సకల జాతుల జీవావరణం మా అన్నతమ్ముళ్ళ
అక్కాచెల్లెల్ల ప్రాణాధారమని...
ఇప్పుడు వాడు నన్నూ తాకట్టు పెట్టి
నా గర్భాన్ని చీల్చి యురేనియం, అల్యూమినియం
మినరల్స్‌ను మల్టీనేషన్స్‌కు అమ్మడం
'అభివృద్ధి'గా మానవ మనుగడకు జీవాధారమైన
చెట్టును మీ ఆకుపచ్చ అమ్మనుచెరబట్టి
చల్లదనం కోసం ఏసీలను.. మానవాళి విధ్వంసం
కోసం అణుబాంబుల్ని సృష్టించ జూస్తున్నాడు
బిడ్డా! నేను మీ ఆకుపచ్చ అమ్మను మాట్లాడుతున్నా
మీ కోసం అల్లుకున్న పచ్చదనాన్ని ధ్వంసం చేసి
జీవావరణాన్ని మాయం చేయ చూస్తున్నరు బిడ్డా
జర జాగ్రత్త!.



– సహచరి
సెల్: 94409 70454

## జీవించాలి

ఈ మనసేమిటో ..
మనిషి చేరలేని ప్రదేశాలను సైతం
చుట్టి వస్తుంది
జీవితానికి సరిపడా ఆనందాన్ని
మోసుకొస్తుంది

ఈ మనసేమిటో..
చుట్టూ అందరూ ఉన్నా
ఒంటరితనాన్ని అనుభవిస్తుంది
కోలుకోలేని బాధలో ముంచెత్తుతుంది

ఈ మనసేమిటో..
రక్తసంబంధాన్ని సైతం తెంచుకొని
తనువు చాలించమంటుంది
వెలుగులు విరజిమ్ముతున్నా
నిశీధినే తలపిస్తుంది

జీవన్మరణాలను శాసించే ఆ క్షణంలోనే
అసలు మనమెందుకు పుట్టామనే ప్రశ్న
మెదడును తొలిస్తే..
ఇప్పటివరకు సాధించిందేమిటని
మనసును నిలదీస్తే..
జీవితమనే వెలుతురు బాటను చూడగలిగితే..
మన ముందున్న సమస్య మంచుముక్కలా కరిగి
మటుమాయమవుతుంది
మనసును ఆవరించిన
మాయాపొర అదృశ్యమై
కొత్త జీవితం మొదలవుతుంది

చదువుతో పాటు విలువలు
సామాజిక దృక్పథం పెంచుకుంటూ..
సంసారంలో పాలు, నీళ్ళలా కలిసిపోతూ..
ఉద్యోగంలో నిబద్ధత ప్రదర్శిస్తూ..
సాటి మనుషుల బాధను అర్థం చేసుకుంటూ..
తదనుగుణంగా పాలకులు
మానవీయ కోణంలో పాలన అందిస్తే..
వెలకట్టలేని ప్రాణాలెన్నో
అర్ధాంతరంగా ముగిసిపోకుండా
చరిత్రలో నిలిచిపోతాయి
ప్రపంచానికి మార్గదర్శనం చేసే
ఎందరో మహానుభావులను
తయారుచేస్తాయి



–గుండు కరుణాకర్
9866899046

## సమయం

సమయం
సర్దుబాటు ఎరుగని
వేతన జీవుల
ఉరుకులపరుగుల జీవితాల్లో
చికాకులు

సర్దిచెప్పే పెద్దలే లేని
న్యూక్లియర్ కుటుంబాల్లో
సమస్యల తాండవం

ఏ క్షణాన ఏ నిర్ణయమో
అంతులేని కథలు
బుర్రకేది తడితే
అదే తుది నిర్ణయం

నిర్ణయమెనుక
దాగిన అంతరాల దొంతరల
ఛేదనలో విఫలం
పెట్టుబడుల విషపుత్రికలు విసిరే
విపత్కర సవాళ్ళ స్వీకరణలో
తడబాటు

అతను ఆమె
రహస్యాలమరికల్లో అనునిత్యం
తలో దిక్కులో
ఆలోచనల సుడిగుండాలు
సాధకబాధకాలు పాలు పంచుకోలేని
అశక్తత

ఆత్మన్యూనతా భావం రగిలిరగిలి
లోలోన ఉడికిఉడికి
ఉరుమురుమి ఒక్కఉదుటున
తెగతెంపులదాకా
మరణపు అంచులదాకా

దాంపత్యపు జీవనంలో
మనసు తెరచి
తెంపులేకుండా మాట్లాడుకునే
సమయాన్ని
సామాజిక మాధ్యమాల్లో దూర్చేస్తే
దూరమౌతున్న బంధాలు
పుటుక్కుమంటున్న వందేళ్ళ మమకారాలు
అనాలోచిత ఆగమాగపు పోకడలతో

గల్లీకో సైకియాట్రిస్టు
గంటలకొద్దీ గోప్యమైన
సమాచార విశ్లేషణతో
కోల్పోతున్న ఏకాంతం
నాలుగు గోడలమధ్య
పరిష్కారమయ్యే చిన్నాచితకా
నలుగురిలో పలుచనగా

పండంటి జీవితాలు
కాలం కాటుకి
విషమైపోయి
భావి సంకెళ్ళ నడుమ
ఊహే భయానకం.



– గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

## "సేల్! సేల్!!"

ఆషాఢం టు శ్రావణం
ఆర్డీఎక్స్ లా అదరగొట్టేస్తుంది!
దసరా టు దీపావళి
ఏకే 47 లా ఊదరగొట్టేస్తుంది!
క్రిస్మస్ టు న్యూ ఇయర్
మిస్సైల్ లా మీదికొచ్చేస్తుంది!
సంక్రాంతి టు ఉగాది
సరికొత్త అణ్వాయుధాలతో
సిద్ధమైపోతుంది!
క్రొత్తల్లుడు అడగపోయినా
ఇల్లాళ్ళు తలవకపోయినా
కూతుళ్ళు ఊరుకున్నా
కొడుకులు పట్టించుకోకున్నా
వెంటాడి ఊదరగొట్టేస్తాయి!
ప్రతి తెలుగు మదినీ
పట్టి కుదుపేస్తాయి!
అవసరం లేకున్నా
తొడగమంటాయి...నయా మాల్!
ఆడంబరానికి పోయైనా
సాధించుకుంటాయి...గోల్డ్ గోల్!
బోల్తా పడకుంటే
జనానికి జరుగుతుంది మేల్!
లొంగిపోతే మాత్రం
సర్వం సేల్ గోల్ మాల్!!



–దేగల అనితాసూరి
సెల్:9247500819

# యురేనియం ప్రాణాంతకం!

యురేనియం అన్ని మూలకాలన్నింటిలో అణుధార్మికత (రేడియో యాక్టివిటి) కలిగిన ఖనిజం . దీనితో అణుబాంబులు , విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయవచ్చు . ఇది భుమిలో వున్నంతకాలం హానిలేదు .బయటకు తీస్తే వేలాది సంవత్సరాలు అణుధార్మికతను ప్రసరింపచేసే ప్రమాదకరమైన ఖనిజం.

యురేనియం ముక్కలుగా విడిపోయినప్పుడు ఏర్పడే పదార్థం ప్రొటాక్టనిమ్ , దీనిక్కూడ అణుధార్మిక శక్తి వుంటుంది. ఇది ముక్కలుగా విడిపోయినప్పుడు థోరియంగా థోరియం రేడియంగా , రేడియం రేడాన్ గ్యాస్ గా మారుతుంది .రేడాన్ గ్యాస్ విడిపోయి ‘ రేడాన్ సంతతి ‘గామారుతాయి . ఇందులో పోలోనియమ్‌తో పాటు అరడజనుకు పైగా అణుధార్మికశక్తి కలిగిన ధాతువులు వుంటాయి. చివరకు మిగిలే సీసం(లెడ్)తోపాటు అన్నీవిషపురితమైనవే.

## అణుధార్మిక శక్తి

అణుధార్మికశక్తిని 1896 లోహెన్రీ బెక్వెరాల్ అనే శాస్త్రవేత్త ఒక రాయిని టేబుల్ సొరగులో పెట్టాడు . అందులో వెలుతురు సోకని విధంగా ఫొటోగ్రాఫిక్ పెట్టబడివుంది. కొన్ని రోజుల తరువాత టేబుల్ సొరగులోంచి ప్లేట్ బయటకుతీసి బాగు చేశాడు. ఆ రాయి పెట్టినంత మేరకు ఫొటో గ్రాఫిక్ ప్లేటుమీద కాంతికిరణాలు ప్రసరించి వుండటం గమనించి, ఎటువంటి ప్రేరణ లేకుండ , రసాయనిక క్రియ జరగకుండా, సూర్యకాంతి ప్రసరించి, చీకటి ప్రాంతంలో వుంచిన ఆ రాయి నుండి విడుదలైన శక్తే అణుధార్మిక శక్తిగా గుర్తించారు.

**ఇది భుమిలో వున్నంత కాలం హానిలేదు. బయటకు తీస్తే వేలాది సంవత్సరాలు అణుధార్మికతను ప్రసరింపచేసే ప్రమాదకరమైన ఖనిజం.**

దీనిలోని రహస్యాలను తెలుసుకోవాలనుకున్న మేరీక్యూరీ ,ఎర్జ్ పర్వతాల నుండి యూరేనియం ముడిఖనిజాన్ని సంపాదించింది. యురేనియంను బయటకు తీయడానికి రాయిని పొడిచేసి ఆమ్లంలో కరిగించి యురేనియంను తీసింది. ఆ రాయి పొడిలో అణుధార్మిక శక్తిమిగిలి వుందని కనుగొన్నది.

అణుధార్మిక శక్తి కలిగిన పదార్థాలలో పరమాణువులు స్థిరంగా వుండక విస్ఫోటనం చెందినప్పుడు ఆల్ఫా , బీటా అనే రెండు రకాల కిరణాలు విడుదలై తూటాలవంటి శక్తి విడుదలౌతుంది.

రేడియంను క్యాన్సర్ పెరుగుదలను కాల్చడానికి హెన్రీ బెక్వెరాల్ , మేరీక్యూరీ ఇద్దరు కాలిన గాయాలతోబాధపడ్డారు . రేడియంను చేత్తో పట్టుకోవటం వలన వారికి వాతలు ఏర్పడ్డాయి . ఇది మిగతా శాస్త్రవేత్తల ఆలోచనలకు అంకురమై క్యాన్సర్ ట్యూమర్లు ఉన్నవారికి రేడియం ఉన్న సూది పెడితే అది క్యాన్సర్ ను కాల్చి వేస్తుంది. అలా రేడియేషన్ ఉపయోగించే క్యాన్సర్ థెరపి మొదలైంది.

రేడియం luminous( మెరిసే) పెయింటింగ్గా ఉపయోగిస్తున్నారు. ఇది చీకట్లో ప్రకాశించే వస్తువు. 1920 లో ఒక గ్రాము యురేనియం ధర ఒక 1,00,000 డాలర్లు .ఇది ఆనాడు చాలా ఖరీదైన వస్తువు.

రేడియం పెయింట్ వేసే యువతకు రోగాలు రావడంతో బ్లూమ్ అనే అమెరికన్ దంతవైద్యుడు ఈ విషయాలను మొదటిసారి తెలుసుకున్నాడు.

అతని వద్దకు వచ్చిన యువతుల దంతాలు రాలిపోయి చిగుళ్ల ఇన్ఫెక్షన్కు గురై రక్తం కారుతూ, రక్తహీనతతో బాధపడేవారు. వారి ఎముకలు పెళుసు బారి ఉన్నట్టుండి విరిగి పోయేవి. కొందరు రక్త హీనతతో మరణించేవారు. రేడియం డయల్ పెయింటింగ్ ప్యాక్టరీలో పనిచేసే వారు రేడియం ప్రభావం వలన ఎముకల్లో కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు

రేడియం శరీరంలోకి వెళ్లిన అణుధార్మిక శక్తి కలిగి ఉంటుంది. రేడియం ముక్కలుగా విడిపోయి రాడాన్ గ్యాస్ గా మారుతుంది. రేడియం డయల్ పెయింటర్స్ ఎముకల్లో రాడాన్ గ్యాస్ ఉత్పత్తై రక్తంలోకలిసి గుండె ద్వారా సరఫరా అయి సున్నితమైన కణజాలాన్ని నాశనం చేయడం వల్ల తలలో క్యాన్సర్ వస్తుంది.

కొన్ని వందల సంవత్సరాల క్రితం 15వ శతాబ్దంలో పర్వతాల్లో పనిచేసిన గని కార్మికులు చనిపోవడానికి కారణం ఊపిరితిత్తుల క్యాన్సర్ అని 19వ శతాబ్ది తర్వాత తెలుసుకున్నారు

యురేనియంతో అణుబాంబును చేయవచ్చని కనుగొనడంతో 1942 నుండి దీనికి విలువ పెరిగి, యురేనియం కొరకు గనుల తవ్వకం మొదలైంది.

1938 లో అణుధార్మిక శక్తి మాత్రమే కాక పరమాణు విచ్ఛేదనంతో విపరీతమైన శక్తి విడుదల అవుతుందని కనుగొన్నారు .డిమాండ్ పెరిగిన యురేనియంను తవ్వడానికి కెనడాలోని గని కార్మికులను ఉత్తర అమెరికాలోని గనుల్లోకి పంపడంతో వారు అనేక గంటలు గనుల్లో ఉండటంతో రేడాన్ వారి ఊపిరితిత్తుల్లోకి వెళ్లడం వలన అనేక జబ్బులు, క్యాన్సర్ రావడం జరిగింది.

యురేనియం పరమాణువులు అణు ధార్మిక శక్తి కలవి గనుక ఒక న్యూట్రాన్ తో పరమాణువు విడగొట్టడం ద్వారా రెండు నాలుగుగా , నాలుగు ఎనిమిదై , ఎనిమిది పదహారుగా విడిపోయే ‘చైన్ రియాక్షన్ ‘కు ఒక సెకనులో వెయ్యోవంతు సమయం పడుతుంది . నీరు ,గాలి నుండి అదృశ్యరూపంలో ప్రయాణిస్తుంది .రేడియం పోలోనియం రేడాన్ గ్యాస్ యురేనియం రూపాంతరమే .

చెర్నోబిల్ దుర్ఘటన ద్వారా ఏర్పడిన రేడియేషన్ లో80% రేడియేషన్ రెండు కిలోల రేడియో ఆక్టివిటీ పదార్థం బయటకు రావడం ద్వారానే జరిగింది ఈ దుర్ఘటనలో వెలువడిన సెసియం -137అనే ప్రత్యేక ఉపోత్పత్తి వలన గొర్రెలు కలుషితమవటం మూలాన ఇప్పటికీ ఇంగ్లండులోని గొర్రె మాంసం మానవులు ఉపయోగించడం లేదు.

**ఉన్న వనరులను ఉపయోగించుకుని ప్రగతిపథంలో సాగాలి . అష్టవంకరలతో పుట్టిన పిల్లలతో, రోగాలతో బతకడం, పర్యావరణానికి ముప్పు తెచ్చుకోవడం, చేయాల్సిన పని కాదు**

యురేనియం రేడియో ధార్మికశక్తిగల అనేక ధాతువులుగా రూపాంతరం చెంది మానవ పరిసరాల్లోకి ప్రవేశించడంతో జీవరాసులకు హాని కలుగుతుంది. ఆహారం ద్వారా పీల్చుకునే గాలి ద్వారా మానవ శరీరంలోకి చేరతాయి. మానవ కణాలు చనిపోతే సమస్య వుండదు .ఏ ఒక్క కణం బతికి ఉన్న బతికి వున్న కణంతో నాశనమైన కణాలుచేరి క్యాన్సర్ అభివృద్ధి కారకమవుతుంది. వీర్య కణాలకు, అండ కణాలకు హాని కలిగి వంశపారంపర్యంగా పుట్టబోయే పిల్లలకు, మనుమలు మునిమనుమల వరకు ఈ ప్రమాదం ఉంటుంది.

యురేనియం వ్యర్థాల వలన రేడియో ధార్మిక శక్తి కొన్ని సంవత్సరాల వరకు ఉండి శ్వాసను విడుదల చేస్తూ ఉండటం వల్ల జంతువులు చేపలు చెట్లు పర్యావరణమంతా నాశనమై ప్రమాదంలో మునిగి పోతాము.

ఎన్నో అనర్థాలకుకారణమైన యురేనియం హానికరం అని తెలిసి, అణ్వాయుధాలకు పెద్ద పీటవేస్తున్నారు .శాంతియుతంగా జీవించడమే లక్ష్యమవ్వాలి. విద్యుత్తు కొరకే సర్వేలని మభ్యపెట్టి వేసిన తవ్వకాలతో, నిజం తెలుసుకుంటున్న ప్రజలు భయాంధోళన చెందుతున్నారు . విద్యుత్తు అనేక రకాలుగా తయారు చేసుకోవచ్చు. ఉపయోగించుకోవచ్చు అధికమైన సాంకేతిక పరిజ్ఞానంతో జ్ఞానాన్ని సక్రమంగా వినియోగించుకొని గర్వించదగ్గ మానవమనుగడకు మార్గం వేయాలి . శాంతి సామరస్యాన్ని నెలకొల్పాలంటే యురేనియంను అలాగే పదికాలాల పాటు భూగర్భంలోనే దాచి పెట్టాలి.

లేదా మానవ మనుగడ చిన్నా భిన్నం అవుతుంది . ఉన్న వనరులను ఉపయోగించుకుని ప్రగతిపథంలో సాగాలి . అష్టవంకరలతో పుట్టిన పిల్లలతో , రోగాలతో బతకడం, పర్యావరణానికి ముప్పు తెచ్చుకోవడం, చేయాల్సిన పని కాదు .చరిత్రలోని చేదునిజాలైన హిరోషిమా , నాగసాకి , చెర్నోబిల్ దురంతాలతో గుణపాటాలుగా తీసుకొని మానవ మనుగడను కాపాడుకోవడానికి యురేనియం వ్యతిరేక పోరాటంలో భాగస్వాములమై సమస్యలను పరిష్కరించుకుందాం.

(అణు 'ధార్మిక' సత్యాలు వ్యాసాల ఆధారం తో..)



– డా॥బండారి సుజాత
9959771228

# యురేనియం తవ్వకాలతో తీరని నష్టం



బహిరంగ లేఖ ప్రతులను విడుదల చేస్తున్న సాహితీవేత్త కె.శివారెడ్డి. చిత్రంలో కవులు, రచయితలు

యురేయం తవ్వకాలతో రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని నష్టం వాటిల్లుతుందని కవులు, రచయితలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. ‘సేవ్ నల్లమల’ ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల గవర్నర్లకు సినీ, సాహిత్య, పాత్రికేయ, తదితర రంగాలకు చెందిన వంద మంది సంతకాలతో కూడిన బహిరంగ లేఖను శుక్రవారం విడుదల చేశారు. ప్రముఖ సాహితీవేత్తలు కె. శివారెడ్డి, నిఖిలేశ్వర్, ప్రజాశక్తి మాజీ సంపాదకుడు ఎస్. వినయ్‌కుమార్, కవులు, రచయితలు యాకూబ్, పసునూరి రవీందర్, భూపతి వెంకటేశ్వర్లు, ఇంద్రవెల్లి రమేష్, కొండవీటి సత్యవతి, కుప్పిలి పద్మ, నర్సింహ, సామాజిక కార్యకర్త సజయ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెరాస, వైకాపా ప్రభుత్వాలు ఎన్డీయే సర్కారుతో కలిసి నల్లమల ప్రాంత లూటీకి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. యురేనియం తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు, సంబంధిత జీవోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సేవ్ నల్లమల ప్రచారకర్తలు అరవింద్, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముక్తకాలు

మంచి చినుకు
మల్లె పువ్వుపై
కురిసినప్పుడే
హిమ స్వచ్ఛత

అమ్మ ఒడిలో
ఆనందంగా
స్తన్యం గ్రోలినప్పుడే
స్వర్గ సుఖం

ఆత్మీయంగా
ఒకరినొకరు
ఆశ్లేషించుకున్నప్పుడే
ఆనందో బ్రహ్మ

చీకటి నుంచి
వెలుగులోకి
వెళ్ళినపుడే
చైతన్య గమనం

బిచ్చగాడి
సత్తు గిన్నెలో
నాణేలు పడ్డప్పుడే
కారుణ్య జగతి

మేడలో కాదు
గుడిసెల్లో
దీపాలు వెలిగినప్పుడే
దేశ ప్రగతి.

నేటి నరేంద్రలు
రేపటి వివేకానందులైనపుడే
భరత ఖండం
ధరణికి ఆదర్శం.

స్వార్థాన్ని
త్యజించినప్పుడే
జగతిలో ఎవరైనా
చరిత్ర పురుషుడు.

విలువైన వలువలతో
విలువలు పెరగవు
దానం చేసినప్పుడే
పాణికి విలువ

తనను తెలుసుకోవడమే
'ఆత్మానాం విద్ధి
తనను దిద్దుకున్నవాడే
సమాజాన్ని దిద్దే సంస్కర్త.



–డా॥ తిరునగరి
93924 65475

## దసరా సరదా

“టప్” మన్నది వానచుక్క
ఎండినాక పైబడి
“టప్పు” మన్నది మరోచుక్క
ఒందు మన్ను పైబడి
పొడిబారిన నేలకు సందేహం!
పులకించనా వద్దా అని
“టప్” మంటూ మరో చినుకు
మోడువారిన వృక్షరాజము పైబడి
చిరు చినుకేనా మరుచినుకుందా!
సంశయంతో “తల” మునకలయ్యింది చెట్టు
అలామొదలైన వాన చినుకులు
ఇంతింతై.. చిరుజల్లులా
ముసురులా, వర్షంలా, చిత్తడి వానలా
జడివానలా, కుంభవృష్టిలా, వరదలా
కురుస్తూనే ఉంది “నేటి” దాకా
మొదట మిరుపకాయ బజ్జీలు తింటూ
వేడి వేడి “చాయ్”లు తాగుతూ
వాననాస్వాదించిన జనాలు
రకరకాల విషజ్వరాలను
దుప్పట్లలో కప్పెట్టుకున్నారు.
రెడ్లన్నీ జలమయం
కార్లలో తిరుగుతూ కిటికీ అద్దాల గుండా
గూండాల్లా చిందులేస్తున్న వానంటే
ఓ పిచ్చి “సరదా” మరి!
మొదట లయగా మొదలైన వాన
రాత్రానూ విలయంగా మారిందెందుకో
నూటికి తొంభై శాతం బడుగు వర్గాలే
ఇంటినిండా దోమలు
ఊరంతా గోతులు
ఓ పక్క వందేళ్ళ భవనాలు
కూలుతామంటూ బెదిరింపులు
చుట్టూ సంద్రమంత నీరున్నా
తాగునీటికి కటకటే
అందుకే ఈ నీటి సడీసవ్వడీ
పేదవాడికి ఎప్పటికీ ఆరని కంటతడి!
పండగపూట ఆ సోదేమిటి అనకండి సోదరా!
“అయ్యవార్లకు చాలు ఐదు వరహాలు!
పిల్లవాళ్లకు చాలు పప్పు బెల్లాలు!”
అంటూ గురువులను సత్కరించడానికి
పంచపప్పులతో పిండివంటలకీ
తియ్యతియ్యని పాయసాలకీ
కలగూరల విందు భోజనాలకీ
ఆడపిల్లల పట్టు పరికిణీలకీ
మగపిల్లల “దసరా” సరదాలకీ
ఏది దారి!???
ఏ ఇంటిలో “జ్వరపు” మంచము ఉండదో
ఏ దవాఖానాలో “ఓ.పి”లో
ఒక్క మనిషీ ఉండడో
ఏ మురికి గుంటలో చుక్క నీరుండదో
ఏ మున్సిపాలిటీ వార్డు శుభ్రంగా ఉంటుందో
అక్కడ... అక్కడే పండగ సరదా!
అదే “దసరా” సరదా”!



– డి. పంకజ మలిక్
9866065462

## ఓ మనిషీ....

మానవత్వం మరచిన మరమనిషీ
సకల జీవకోటిలో తెలివైనవాడివి
కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్న అంధునివి కూడా
అమెజాన్ కార్చిచ్చు కు కారణం నువ్వు కాదా..?
నల్లమల ను నలపాలని చూసింది నువ్వే కదా
యురేనియపు ఉరితాళ్లతో నను చంపగ చూసావు
బోరున నే విలపించగా బోరుబావి దించావు
నీ పాపాలే, శాపాలై అతివృష్టి...అనావృష్టి
నీ కోపానికి బలి అయ్యి సిగ్గుపడెను సకల సృష్టి
నేనిచ్చా...ప్రాణవాయువు, బతికున్నావ్ అది పీల్చి
ఏమిచ్చావ్ బదులుగ నువ్వు నా ఎదను చీల్చి
సునామీలు, తుఫానులకు కారకుడివి నువ్వేగా
ఇపుడెందుకు ఏడుస్తావ్ నువ్ చేసిన పాపమేగా
నేనున్నది నీకోసమె....నువ్వున్నావ్ అది మరచి
మారురా ఓ మనిషీ ఇపుడైనా కళ్ళు తెరచి.



–జాబేర్.పాషా
0096897663604

## వారసత్వం గొడుగు !!

తాను వానలో నానుతూ
నన్ను నానకుండా
వరదలు దాటించి
ఇంటి వరకూ నడిపించింది --
మా నాన్న ఈ గొడుగు కిందే
ఈ పుర వీధుల వానను
ప్రాసలుగా అనుప్రాసలుగా తడిపాడు !
స్వాతి ముత్యం పదాలే

మా తాత నడకకు హోదా
గొడుగును విడిచింది లేదు !
ఎండా వానకు
సహస్ర పద్మమే ఈ గొడుగు !
కొన్ని కుట్లు పడ్డా ఎన్ని
వర్షాలను మోసిందో
ఈ ఛత్రీ కింద నడిస్తే
నానతో తాతతో నడిచినట్లుంటుంది !
నడక నేర్చినట్లుంటుంది !



– కందాళై రాఘవాచార్య
9908612007

## పూలు-అక్షరాలు

విడి విడిగా పడివున్న పూలు
పొడి పొడిగా సాగిలపడి వున్న అక్షరాలు
పూలను అందంగా, రంగురంగులుగా పరిమళభరితంగా
దండలు, హారాలు, బొకేలుగా కూర్చాలి!
అక్షరాలను అందంగా, అర్థవంతంగా, ప్రయోజకంగా
కవితలు, కథలు, సాహిత్యంగా మార్చాలి
అలా చేసేవాళ్లే ప్రతిభవున్న కళాకారులు
పూలు-దేవుళ్ళ, మహనీయుల మెడలో, మహిళల జడలో
ద్వారాలకు తోరణాలుగా
ఇంటిముంగిట గొబ్బెమ్మలతల్లో, ముగ్గులకు అలంకారాలుగా
అక్షరాలు- ప్రజల నాలుక మీద, మెదడు, మనసు మీద
చైతన్యం రగిలిస్తూ, విజ్ఞానాల వెలుగులు ప్రసరిస్తూ
అపుడే పూల పుట్టుకకు సార్థకత
అక్షరాలకు పారమార్థకత
ఆనటి నుండే వాటి జన్మం ధన్యం!



– డా॥ కేతు బుచ్చిరెడ్డి
94406 45153


ఆహ్వానం

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
సౌజన్యంతో
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
ఆధ్వర్యంలో
ప్రముఖ ముంబయి రచయిత
డా॥అంబల్ల జనార్దన్







ముంబయి చూపుతో....
తెలుగు కథానికలు
గ్రంథావిష్కరణ మహోత్సవం

తేది : 12-10-2019 శనివారం సా॥ 6-00 గం॥లకు
వేదిక : రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్

ముఖ్య అతిథి
ఆవిష్కర్త : డా॥ నందిని సిధారెడ్డి
అధ్యక్షులు - తెలంగాణ సాహిత్య అకాడమీ
సభాధ్యక్షులు : డా॥ ఏనుగు నరసింహా రెడ్డి
కార్యదర్శి - తెలంగాణ సాహిత్య అకాడమీ
విశిష్ట అతిథి : డా॥ మామిడి హరికృష్ణ
సంచాలకులు - తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
ఆత్మీయ అతిథి : శ్రీ బైస దేవదాస్
సంపాదకులు - నేటి నిజం దినపత్రిక
గౌరవ అతిథులు : శ్రీ ఆనంద చక్రపాణి ప్రముఖ సినీ నటులు
గ్రంథ పరిచయం : డా॥ ప్రభాకర్ జైనీ ప్రముఖ రచయిత, దర్శకులు
స్పందన : డా॥ అంబల్ల జనార్దన్ గ్రంథ రచయిత

అందరూ ఆహ్వానితులే !

బండారుపల్లి రామచంద్రరావు
అధ్యక్షులు,
మానస ఆర్ట్ థియేటర్స్

డా॥ లలిత వాణి
ఉపాధ్యక్షులు,
మానస ఆర్ట్ థియేటర్స్

రఘుశ్రీ
కార్యదర్శి, మానస ఆర్ట్ థియేటర్స్
9247108893


## అవ్వ ఆవేదన

నా పేరు నా పేరే వేరెవ్వలి కాదు
కట్టె కట్టోలె వున్న చాల కట్టపడ్తున్న
వయసంటరా డెబ్బై దాకుండొచ్చు!
నేను ఐసుదాన్ని! మరి పించినే లేదు!
తెలంగాణ వచ్చిన బతుకుత్తదేనా!
దస్కత్ మీద దస్కత్ దరఖాస్తులు గంపెడు
ఐనా ముసలి, ముండరాలు ఏ పించిని లేదు
జిల్లా రాసున్న సిరిసిల్ల నాకు అన్నీడుల్ల
కాయకష్టం చేసి బొక్కలాగిన్నై
అరుగనొల్లకు పించినిత్తుండ్రు
వాల్లు హాయిగా బతుకుతుండ్రు
బియ్యపుకారెటివ్వరు! గుంజుకుంటరా!
తిండి గింజలకు తిప్పలు వెడ్తరా!
నా ఉసురు తప్పక తగుల్తది
ఆర్మీ జవాను అమ్మను అతలాకుతలం చేస్తారా!
ఉన్నబొక్కలు ఊడినంక పించినిత్తరా!
అలసి అలిసి మండలాఫీసు నడిసి దండగాయే!
ఆత్మ పరమాత్మ దగ్గరకు పోయేటట్టుంది
ఓ సిరిసిల్లసారు చీదరించుకోకు
పించినవ్వండి నేను ఫినీష్కాక ముందు
దేశభక్తి వుంటే గిట్ల చేస్తరా!
దేశ సరిహద్దుకైనా పోయేటొల్లు
కొన్ని హక్కులు చట్టాలు కొందరికే చుట్టాలా!!
బతుకంతా పెన్షన్ ఐనా ఏది పించిన్
అవ్వ ఆవేదన జెర ఆలోచించుండ్రి!



– డా॥ పెరుకరాజు
9443091384

## ఆమె ఒక సూక్ష్మీకరించబడిన విశ్వం!

వెన్నెల
అలా నట్టింట్లో ఒలికినట్లు
పున్నమి
అలా నవ్వుతూ తిరిగాడినట్లు...
ఆడపిల్ల పుట్టిందంటే
వేల వసంతాలొక్కసారే నవ్వినట్లు
అమ్మే... మరోసారి మనింట్లో పుట్టినట్లు!

భుజాలెత్తు ఎదిగిన కూతురు
నాన్నకు ఓ సంబరం
అమ్మకు ఓ ఆనందం
ఒక తరాన్ని వెలిగించే చదువు
ఒక ఇంటిని నిలబెట్టే సంస్కారం
ఆడపిల్లంటే
ఒక సాంస్కృతిక రాయబారి
ఒక ఆకుపచ్చని పందిరి!

నడి వయస్సులో
ఆమె ఒక మర్రి చెట్టు
గొడుగులా విస్తరించి
పక్షులెన్నింటికో గూడై నీడై!
ఆడపిల్లంటే...
వేల నక్షత్రాలు పొదిగిన ఆకాశం
కోటి కెరటాలను జోకొట్టే సముద్రం!
సరిగా చూడు,
ఆమె ఒక సూక్ష్మీకరించబడిన విశ్వం!
(అక్టోబర్ 11: ప్రపంచ బాలికా దినోత్సవం సందర్భంగా)



– సాంబమూర్తి లండ
9642732008

## బాధ్యత

నిద్రలో స్వప్నాలు
నిజాలు కావు
నీతి, నియమాలు పాటించడం
మనిషి లక్షణం
ఎవరి దోషాలు లెక్కించవద్దు
మనిషిని గౌరవించడం
మరువొద్దు
దైవ చింతనతో
ముందుకు సాగు
తల్లిదండ్రుల సేవ
మరిచిపోకు.



–దేవనపల్లి ఓగన్న
సెల్: 07972289784

## పుల్లా మురళీఆకాశ్ మొదటి నవల

# ముగింపు లేని కథ



(గత సంచిక తరువాయి..)

"ఏయ్ ! అటు చూడు కుక్క లేచి ఎక్కడికో పరిగెడుతుంది" అంది విస్తరాకు. నేను అటువైపు చూశాను. ఆ కుక్క పరిగెడుతుంది, ఒకరి ముందు ఆగింది.

**ఈ కుక్క ఎప్పుడు మోసపోతుంది. అన్నం పెడతారు అంటే చాలు తోక ఆడిస్తుంది.** అన్నం పేట్లులో పెట్టుకొని ఉన్నాడు ఒక ముసలి. చింపిరిగా చింపిరిగా జుట్టు, గడ్డం చాలా వరకు పెరిగిపోయింది. కళ్ళు లొపలికి వెళ్ళిపొయాయి, బుగ్గలు లొతుగా వెళ్ళిపొయాయి, నోటిలో నుంచి ఎంగిలి కారుతుంది ముఖం మొత్తం మాసిపొ యింది. చొక్క చినిగిపొయింది. ప్యాంటు కూడ చాలా వరకు చినిగిపొయింది. బుజాన ఒక్క సంచివుంది. అతను ముష్టి అడిగేవాడు.

"ఆ ముష్టివాడికే అన్నం ఉండదు, వీడు ఏమి పెడతాడని తోక ఊపుతూ వెళ్ళిందిరా" అంది గ్లాసు. ఆ అనాధ కుక్కని చూశాడు. ఆ కుక్కకి ఆకలితో కంట్లో నీళ్ళు కారుతున్నాయి. ఆ అనాథ అన్నం కింద పెట్టి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

"గ్లాసు చూశావా ? దేవుడు ఇలాంటి వారిని ఎందుకు ధనవంతుడిగా పుట్టించరు అంది. విస్తరాకు కళ్ళలో నుంచి నీరు తుడుచుకుంటూ.

**"అది ధనం వుంటే వచ్చేది కాదు. హృదయం నుంచి వచ్చేది దానం".** అంది గ్లాసు ఏడుస్తూ.

"తాతగారు లే లేవండి అంటూ మాటలు వినపడ్డాయి. తాతగారు లే లేవండి అంటు మళ్ళీ మాటలు వినబడడంతో ఉలిక్కిపడి లేచాను. ఆ విస్తరాకు కల్ల చూశాను, అక్కడ కుక్క లేదు. "బాబు అక్కడ కుక్క ఉండాలిగా" అని అడిగాను. దానిని తరిమేశారు తాతగారు అన్నాడు రాఘవయ్య మనవుడు. ఐతే ఇదంతా నా భ్రమన్నమాట.

"తాతగారు మిమ్మల్ని మా తాతగారు పిలుస్తున్నారు అండి వెళ్దాం" అని వాడు నా చెయ్యి పట్టుకొని తీసుకువెళ్తున్నాడు.

"తొందరగా రండి సార్" అంటూ పిలుస్తున్నాడు రాఘవయ్య.

"రాఘవయ్య నీ మనవడు చాలా తెలివైన వాడు. నేను ఎక్కడికైనా వెళతానేమోనని చెయ్యి పట్టుకొని మరీ తీసుకొచ్చాడు" అన్నాను.

"రాఘవయ్య ఇక నాకు సెలవు"

"అదేంది సార్ రాత్రి ముగింపు పార్టీ ఉంది, ఉండొచ్చు కదా"

"లేదయ్యా ఇప్పటికే చాలా లేటు అయ్యింది, ఇంట్లో మా వాళ్ళు భయపడతారు, రేపు కలుద్దాంలే ఇక సెలవు" అంటూ బయటకు వచ్చేశాను.

అలా నడుస్తూ ఇంటికి వెళ్తున్నాను. అప్పుడే ఆకాశంలో ఢాం....ఢాం... అంటూ బాణాలు పేలుతున్న శబ్దం వచ్చింది. ఢం....ఢం.... బాణాలు కాలుస్తున్నారు.

"నమస్తే సార్" అంటూ ఎవరో పలకరించారు అందుకని పక్కకు చూశాను "అంగడిలో కూర్చుని మరోసారి నమస్తే సార్" అని అన్నాడు గోపాలయ్య.

"ఏమి గోపాలం వ్యాపారం బాగా జరుగుతుం దా" అన్నాను. "ఆ బాగా జరుగుతుంది సార్" మరోసారి ఢాం...ఢాం... అని శబ్దం వచ్చింది.

"ఏమిటది" అని అఢిగాను. "దీపావళి దగ్గరకు వస్తుంది" కదా సార్, సరుకులన్ని తీసుకువచ్చాం ఇంట్లోకి రండి అని పిలిచాడు.

లేదయ్య ఇంటికెళ్ళాలి మళ్ళీ కలుస్తానులే అని చెప్పి వచ్చేశాను. అలా ఆలోచిస్తూ నడుస్తున్నాను. ఢాం అని పేలింది బాణం. గుండె వేగంగా కొట్టుకుంది. ఎవరూ అని చూశాను ఎవరూ కనిపించలేదు. చిన్నప్పుడు పేపర్‌లో నేను చదివిన కథ గుర్తుకు వచ్చింది.

"తాతయ్య... తాతయ్య అంటూ పిలచారు తన మనవళ్ళు కేతన్, భార్గవ. తాతయ్య ఎక్కడునావు అన్నాడు భార్గవ్.

"ఆ ఏమిరా" అన్నాడు తాతయ్య.

"తాతయ్య కేతన్‌కి పది రూపాయలు కావాలంటా" అన్నాడు భార్గవ్. "రేయ్ నాకొకనికే అన్నట్టు చాడీలు చెప్పకురా, బయట ఏమన్నావు ఇద్దరం కలిసి అడిగి తీసుకుందాము అన్నావు. ఇక్కడికి వచ్చి నాకొక్కనికే కావాలి అన్నట్టు నా మీద చాడీలు చెపుతావా నిన్ను....

"మీకు ఏమికావాలి" అన్నాడు తాత.

"మాకు పది రూపాయలు కావాలి తాత".

"ఎందుకురా కేతన్ మీకు ఎందుకు కావాల్సొ చ్చింది చెప్తే నేను ఖచ్చితంగా మీకు ఇస్తాను".

"తాత మా స్కూల్లో అందరు పిల్లవాల్లు కురుకురేలు, బిస్కెట్లు, చాక్లెట్లు కొనుక్కుని తింటున్నారు. మేము మాత్రం వారు తినే తిండికల్ల చూడవల్సివస్తుంది తాత".

**"అలాంటివి తింటే మీకు రోగాలు వస్తాయి, జబ్బు పడతారు. వాటిని తింటే మీకు రోగాలు వస్తాయని మీ టీచర్లు మీకు చెప్పలేదా ?',**

తాత మేము అవేమి తినము అన్నాడు భార్గవ్. "మేము పండ్లు తింటాము, మా స్కూలులో పండ్లు కూడా అమ్ముతారు తాతయ్య" అన్నాడు కేతన్.

అలాంటివి ఎప్పటివో ఉంటాయిరా, మా నాన్నవాళ్ళు అలాంటి చిరుతిళ్ళు తిననిచ్చేవారు కాదు తెలుసా ! వారు మా కోసం చెనిక్కాయలు, బటానీలు చేసి ఇచ్చేవారు. సరేలేండి ఇదిగోండి తీసుకోండి, బాగా చదువుకుంటారంటేనే మీకు డబ్బులు ఇస్తాను"

"సరే తాతతయ్య" అని ముక్త కంఠంతో అన్నారు కేతన్, భార్గవ్‌లు. డబ్బులను ఊరికే తినడానికే వాడకూడదు, వాటిని పొదుపు చేసుకోవడం తెలుసుకోండి. మీరు బాగా తినండి, బాగా చదువుకోండి".

"మా మంచి తాతయ్య"

"ఏవండి వాళ్ళకెందుకండి రోజు డబ్బులు ఇవ్వడం" అంది అవ్వ.

"వాళ్ళేమి నీలా చీరలు కొనాలి, బంగారం కొనాలి అంటూ ఖర్చు ఏమి చేయడం లేదు".

"ఆ అన్నీ నేనే చేస్తున్నట్టు, మీరు బీడీలు తాగడానికి వృధా చేయడం లేదు"

"సరేలేవే ! మేము ఎప్పుడైనా మీతో గెలిచామా".

"ఆ పదండి భోజనం చేద్దురుగానీ". బాయ్ తాతయ్య మేము స్కూలుకు వెళ్ళివస్తాం. బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు తెచ్చుకోవాలి సరేనా"

"మీరు రండి భోజన చేద్దురు".

"నేను తినను అంటే నువ్వు నోట్లోకి కుక్కవూ"

"అబ్బా ! చాలుచాలు లేండి ఇంత భయం ఉంటే నా బతుకు ఇలా ఏడిచేదా"

"పదపదా నాకు ఆకలి వేస్తుంది, భోజనం పెట్టు పదా, ఈ రోజు ఏం చేశావు".

"ఆ తింటే తెలుస్తుంది ఏమి చేశానో" అని భోజనం తినడానికి వెళ్ళారు ముసలివాళ్ళు.

×××

కొన్ని రోజుల తర్వాత, "నా డబ్బులు ఎంత అయ్యాయెా తెలుసా ! అన్ని తాతయ్య ఇచ్చినవేరా" అన్నాడు భార్గవ్.

"ఇన్ని రోజులు నా ముందు ఫోజుకొట్టావుగద రేపు తెలుస్తుంది లేరా ఎవరిది ఎంతో"

"సరేలేరా"

"ఏమిరా గొడవ" అంటూ అవ్వ వచ్చింది.

"ఏమిలేదవ్వా"

"రేపు తొందర లేద్దురు, తలస్నానం చేయాలి, కొత్త బట్టలు వేసుకొని గుడికి వెళ్ళాలి".

"అవ్వ వద్దవ్వా" తొందర లేపొద్దు.

"భార్గవ్ చూడు పడుకున్నాడు అప్పుడే. నువ్వూ పడుకో, నాకు నిద్ర రాలేదు అన్నాడు కేతన్. "ఏమేయ్ నువ్వు పడుకో పొద్దున్నే లేవాలిగా, నేను వాన్ని జోకొడుతానులే అన్నాడు తాత.

"మీరే పడుకోండి" పొద్దున్న నుంచి పనిచేసి అలసిపోయింటారు. "ఇంత పెద్ద పిల్ల వాళ్ళైన జోకొటాలబ్బ" మనవళ్ళ గురించి అవ్వాతాతాలు ముచ్చటించుకొంటూ నిద్రపోయారు.

×××

"లే లేవండి, రేయి లేవండి".

"అవ్వ ఇంకొద్ది సేపు పడుకోనివ్వు"

"రేయి ఈ రోజు దీపావళి తొందరగా లేవండి"

"అవును కదా అంటూ ఒక్క ఉద్దటున లేచారు ఇద్దరు".

"పదండి ఇద్దరికి స్నానం చేయిస్తాను"

"అవ్వా ఇంత పొద్దునేనా" అన్నాడు కేతన్

"ఏమి కాదు, మొదటి చెంబు నీరు మాత్రమే చలిపుడుతుంది, ఇక ఏమి కాదు పదండి, తొందరగా గుడికి వెళ్ళాలి లేయండి".

"రేయి పదండి లేకపోతే ఇంటిలోకే నీళ్ళు తీసుకువస్తుంది".

"అది ఏమి కాదు, మీకు ఈ రోజు ఒకటి చూపిస్తాను"

"ఏమిటది అవ్వా"

"మీరు స్నానానికి వస్తానంటే చూపిస్తాను.

అది ఎంతో కాంతివంతంగా వుంటుంది తెలుసా" అన్నాడు తాత.

ఏమిటది తాత అన్నాడు భార్గవ్.

"ఆశ దోశ అప్పడం వడ, మీరు స్నానం చేస్తే మీకు చూపిస్తాను"

**"వద్దవ్వా వద్దవ్వా అంటుంటే చల్లనీళ్ల స్నానం చేయించింది. "రండి రా, రండి తల తుడుస్తాను, లేదంటే జలుబు చేస్తుంది".**

"ఓయ్ ! నాకు తల తుడుచువా" అంటూ అడిగాడు తాత.

"మీరేమన్నా చిన్నపిల్లాడా తల తుడ్చడానికి" "రేయ్ చూడండి" అన్నాడు తాత.

"అవ్వా దయచేసి తల తుడుచవే తాతతకి" అంటూ అడిగారు పిల్లలు.

"ఇంక తుడ్చక తప్పుతుందా !".

"ఏమోయి ! నా తెల్ల జుట్టు పీకేస్తావా ఏమిటి ? అంతరంగా తిక్కుతున్నావు"

"మీకు జుట్టు ఎక్కడవుందని, ఫోజు కొట్టకండి, సరేలే పదండి కొత్త బట్టలు వేసుకుందురు".

"అవ్వా ! మాకు కొత్త బట్టలు తెచ్చారా ?, చూపించు"

"పదండి చూపిస్తా, మీరు కూడా తయారవండి. "మాకు కొత్త బట్టలు వచ్చాయి యాహూ !'' అంటూ గెంతులేస్తున్నారు పిల్లలు. "అవ్వ కొత్త బట్టలు చాలా బాగున్నాయి".

"ఇవి మీ తాత మీకు తీసుకు వచ్చాడురా".

"కృతజ్ఞతలు తాతయ్య" అన్నారు ఇద్దరు.

"ఏమండి ! ఇంకా ఆ పొదరు కొట్టింది చాలు పదండి గుడికి" గుడికి కావాల్సిన పూజా సమాగ్రిని సంచిలో తీసుకొని సిద్దంగా ఉంది.

"అవునురా అదిగో గుడి ఎంత ప్రకాశంగా కాంతులీనుతుంది" అంది అవ్వ.

"అవునవ్వ చాలా అందంగా ఉంది" అన్నాడు భార్గవ్.

"ఇదేమి చూశారు ఇంకా లోపల చూద్దురుపదండి" అన్నాడు తాతయ్య.

"ఆ పదండి" అంటూ అందరూ గుడిలోపలికి పరుగులు తీశారు పిల్లలు.

"అవునవ్వ, చాలా అందంగా ఉంది. ఆ శివుని ఆకారం ఇంకా అందంగా ఉంది" అన్నాడు కేతన్.

"అక్కడ చూడండి ఓ ఆకారం, అవును తాతయ్య చాలా రీతులు ఉన్నాయి, ఎంత అందంగా పెట్టారో చూడండి".

"అవును తాతయ్య"

"ఇప్పుడు చూడండి ఆ సూర్యుని కిరణాలు ఎంత బాగా వస్తాయెా'' అవును తాతయ్య, చాలా మనోహరంగా వుంది. "రేయి పదండి స్వామిని దర్శించుకుందాం.

గుడి చుట్టూ ప్రదక్షణలు చేసి ఇంటికి వెళ్దాం అంది అవ్వ.

"పదండి, పదండి ఇంటికి వెళ్ళి భక్షాలు చేసుకొని తిందాం. "ఆ పద తాతయ్య అంటూ ఇంటికి చేరుకున్నారు. అలా మధ్యాహ్నం భోజనాలు ముగించారు.

"తాతయ్య మేము బయటకి వెళ్ళి వస్తాం... బాయ్.... "రెయి తొందరగా రండి" "ఆ సరే తాతయ్య".

"నువ్వు ఎన్ని రకాల టపాకాయలు ఎన్ని ఎక్కువ తెస్తావో నేను చూస్తా, ఎవరు గెలుస్తారో తెలిసిపోతుంది" అన్నాడు భార్గవ్.

సరే చూద్దాంలేరా... !

సాయంత్రం ఆరు గంటలు అవుతుంది, పిల్లలు ఇంకా రాలేదేంటండి"

"వస్తుంటారులేవే స్నేహితులతో ఆడుకుంటుంటారు, అదిగో వస్తున్నారు చూడవే".

"ఆ పిల్లలు ఎంత దూరంలో వస్తున్నా తెలుస్తుంది కాని కళ్ళజోళ్ళు మాత్రం పక్కనున్నా తెలీదు.

"నువ్వు ఉన్నావు కదా అనీ"

"ఏమిటో కవర్లు తీసుకువస్తున్నారు అక్కడ చూడండి". "ఇంటికి రాకుండా ఎక్కడికి పోరులే ఇక్కడికి వస్తారు కదా"

"తాతయ్య ! మేము ఇన్ని రోజులు దాచిపెట్టుకున్న డబ్బులు పెట్టి ఇదిగో ఇవి కొనుకున్నాము చూడు తాతయ్య" అన్నారు పిల్లలు.

"అంటే ఇన్ని రోజులు వీటి కోసమా డబ్బులు దాచుకుంది"

"అవును అవ్వా !

"మీరు చాలా తప్పు చేస్తున్నారురా అనేలోగా,

"ఓయ్ వారు ఇకా చిన్న పిల్లలే ఆడుకోనివ్వు పెద్దగైయాక తెలుసుకుంటారు లేవే".

"మీరు ఇలా అనబట్టే వారు ఇలా చేస్తున్నారు" కోపగించుకుంది అవ్వ.

"ఏమి కాదులేవే" "తాతయ్య ఇక్కడ చూడు మా ఇద్దరిలో ఎవరు ఎక్కువ టపాసులు తెచ్చారో చూడు అన్నాడు కేతన్.

"నా బాణాలే బాగా పేలుతాయి" అన్నాడు కేతన్.

"కాదురా నా బాణాలే బాగా పేలుతాయి" అన్నాడు భార్గవ్.

"అదేమి కాదు మొదట చూద్దాం పదా". "ఏమే వంట పూర్తి కావచ్చిందా ? అంటూ పిల్లలు ఏమి చేస్తారో చూద్దామని కుర్చీ వేసుకొని చూస్తున్నాడు, మరొపక్క టి.వి. చూస్తున్నాడు.

"ఆ ఇంకా కాలేదండి".

"చూడు నా రాకెట్ ఎలా పైకి పోతుందో అంటూ వదిలాడు భార్గవ్. సూయి.... సూయ్...సూయ్ అని ఆకాశంలోకి ఎగిరింది.

అబ్బో బాగా చెప్పావులే నా భూచక్రం చూడు ఎంత వేగంగా గిర్రున తిరుగుతుందో"

"ఏమి కాదు, నా సురసుర బాణమే చూడు ఎంత ఎత్తు వెళ్తుందో.

"నీది కాదు నాదే ఎంత ఎత్తుకు వెళ్తుందో చూడు".

"రేయి నీ తాడు బాణంకన్న, నా తాడు బాణం ఎక్కువ సేపు మండుతుంది" చూడు.

"నా పూలపూల రాకెట్‌రా బాగా పైకి పోతుంది"

"కాదు నాది రా"

"నా లక్ష్మీ బాణం చూడు ఎంత గట్టిగా పెలుతుందో అంటూ పెల్చాడు. ఢాం....

"అంతేనా వంకాయ బాణం చూడు నిజమైన బాంబులా పేలుతుంది ఢాం...ఢాం... అని టపాకాయలు పేల్చుతున్నారు. ఊరంతా అదే సందడి ఉంది. పిల్లలు పెద్దలు సంతోషాన్ని పోటీ పడి చూస్తున్నారు. టపాకాయలు పేల్చుతున్నారు.

"ఏవండి ఈ వంకాయ కూరలో ఉప్పు సరిపోయిందో లేదో చూడండి"

"ఏవండి మిమ్మల్నే ఏమీ ఈయన టి.వి.లో ఇంతలీనమయ్రై పోయాడు, ఇందులో ఉప్పు తక్కువై అయిందేమో చూడండి. మిమ్మల్నే పిల్లల్ని తిట్టినందుకు అలిగినట్టున్నాడు. ఇటు చూడండి అంటూ చేతులతో తల పక్కకు తిప్పింది ఆయన తలపక్కకు వాల్చేశాడు.

"ఏవండి" అని అరవడం... 108కి ఫోన్ చేయడం, వాళ్ళు రావడం, ఎక్కించడం, నా కొడుక్కు, కోడలకి ఫోన్ చేసి ఛెప్పాను, ప్లిలలు, వాళ్ళమనాన్నలతో కలిసి అందరు హాస్పిటల్‌కు వచ్చేయడం జరిగింది. "డాక్టర్ ఏమైంది డాక్టర్ మా నాన్నకు అని అడిగాడు కొడుకు రామమూర్తి

**"సార్, మీ నాన్నకు హార్ట్ఎటాక్ వచ్చింది. "సీరియస్ కండీషన్" అని లోపలికి వెళ్ళిపోయాడు.**

"అమ్మా అంటూ పిల్లలు అమ్మ దగ్గరకు ఎడుస్తూ చేరిపోయారు. అవ్వ తలపట్టుకొని గోడకు చేరిపోయింది. డాక్టర్ బయటకు వచ్చారు.

"అవ్వ మీ ఆయనని పదైదు నిమిషాల ముందు తీసుకు వచ్చుంటే బతికించగలగేవాళ్ళం".

సార్ ఇంతకీ ఏమి జరిగింగి సార్, కన్నీళ్ళు తుడుచుకుంటూ" అడిగాడు రామమూర్తి. "ఎవరు బాణాలు కాల్చింది, భయపడ్డాడు మీ నాన్న"

"నా కొడుకులు సార్".

**"వారు బాంబులు కాల్చుడంతో ఆ సడన్‌గా జరిగిన ఇన్సిడెంట్‌కి గుండె బెదిరిపోయి హార్ట్ఎటాక్ వచ్చింది. ఇంకా ఆ పొగను మీ నాన్నగారు పీల్చుకోలేక ఊపిరితిత్తులు మూసుకొని పోయాయి. గాలి ఆడక ఆయన మరణించాడు.** పిల్లలు మీరు ఆడిన ఆటలకి మీకెంతో ఇష్టమైన తాత ప్రాణాలు తీశాయి". "ఇలా చాలా ప్రాణాలు రోజూ పోతు న్నాయి. మీలాంటి వాళ్ల ఆ టపాసులు పేల్చడం వల్ల పాలు తాగే పిల్లలు భయపడి గుండె కొట్టుకోవడం ఆగిపోయి చనిపోతున్నారు. ఇక ట్రాఫిక్‌లో కూడా ఎక్కువ సేపు వుండి చెవుడు రోగాలు వస్తున్నాయి. ఇంకా ఆ బాణాలు ఎంతో గాలి కాలుష్యాన్ని సృష్టిస్తాయి. ఇది అందరం తెలుసుకోవాలి.

మీ అవ్వ చెప్పినా వినకుండా మీ తాత ప్రాణాలు తీసుకున్నారు. మీరు మీ తాత ప్రాణాలు ఎలాగో తీసుకురాలేరు, కనుక మీరు ఇంకెప్పుడు బాణాలు కాల్చమని మాట ఇవ్వండి అన్నాడు డాక్టర్.

"అవ్వా మమ్మల్ని క్షమించవా ? అంటూ కౌగిలించుకున్నారు" "మీరు ఏమి చేయలేదురా, ఆయన నా మీద కోప్పడి వెళ్ళిపోయారు అంతే" అంటూ ఏడ్చింది అవ్వ. (సశేసం..)






## నేటి నిజాలు

రాయి ఎంత కఠినమైనా కావచ్చు
చెక్కుతున్న శిల్పి హృదయం నవనీతమై
భావంలోని రమ్యత మధురాతి మధురమైతే చాలు
అందమైన శిల్పసౌందర్యం సాక్షాత్కారమవుతుంది

జీవితమూ అంతే..
'యత్ భావం తత్ భవతిః'!

- కెరె జగదీష్



# గ్రామస్వరాజ్యానికి అడుగులు పడాలి

హైదరాబద్, అక్టోబర్ 9: జన సంక్షేమమే అంతిమ ఎజెండాగా పనిచేసే వారే నిజమైన పాలకులు అని మహాత్మాగాంధీ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టేలా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తేనే పథకాలు సాకారం అవుతాయి. వ్యవస్థ బాగుపడాలన్న సంకల్పంతో ఉపయోగపడే పనులకు తొలి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం సాగుతున్న క్రమంలో ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయి. భారతదేశంలో గ్రామస్వరాజ్యం రావాలని గాంధీజీ కలలు కన్నప్పటికి ఆయన సారథ్యం వహించిన కాంగ్రెస్ పార్టీ దేశాన్ని అర్ధ దశాబ్దం పాలించినా అది సాకారం కాలేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం ద్వారానే గ్రామస్వరాజ్యం సిద్దించగలదు. గ్రామాలు బాగుపడితేనే దేశం ఆర్థికంగా పటిష్టం అవుతుంది. అందుకు పాలకులు నడుం బిగించాలి. ఆ దిశగా కార్యక్రమాలు చేయాలి. అయితే గ్రామాల్లో అలాంటి కార్యక్రమాలు జరిగిన దాఖలాలు కనబడడం లేదు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో సదీర్ఘ కాలం కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయినా వ్యవసాయంతో సహా గ్రామాల వికాసానికి ఎలాంటి మార్పులు తీసుకోలేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా నేటికీ మంచినీటికి కటకట లాడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో నియంతృత్వ ధోరణులను పెంచి పోషించిన రాజకీయాలకు కాంగ్రెస్ పెట్టింది పేరు. ఇలాంటి రాజకీయాలకు చరమగీతం పాడాలి. స్వపక్షం, విపక్షం అన్న తేడా లేకుండా అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధులు అందించి, అంతటా అభివృద్ధి అన్న నినాదమే అసలైన పాలన. అలాంటి ఆరోగ్యకర వాతావరణం ఇప్పుడు తెలుగునేలపై సాగుతోంది. ప్రతిపక్షనాయకులుగా రోజూ విమర్శించే వారితో పాటు ప్రభుత్వాన్ని నిత్యం విమర్శించే ఇతర పార్టీల ఎమ్మెల్యేలు అందరూ తమ నియోజకవర్గాల్లో సాగుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములుగా ఉన్నారు. ఇలాంటి అసమానతలు లేని విధానాన్ని రూపొందించడం వల్లనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ఎక్కడా విలువలు తప్పకుండా, పారదర్శకత విస్మరించకుండా అనేక పథకాలు సాగుతున్నాయి. బీళ్లు బారిన తెలంగాణ భూములను సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో, గొంతెండుతున్న జనం కష్టాలను తీర్చాలన్న సంకల్పంతో ప్రారంభించిన పథకాలు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ. ఈ పథకాల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు వచ్చే నిధులకు సమానంగా ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు అందుతున్నాయి. అంతటా ఒకేవిధమైన అభివృద్ధి సాగుతుంది. అంతటా గొలుసుకట్టు చెరువులన్నీ వరుసకట్టి అలుగుపోస్తున్నాయి. వివిధ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడానికి ఎలాంటి చర్యలైనా తీసుకునే అధికారం, స్వేచ్ఛను జిల్లా కలెక్టర్లకు ఇస్తున్నట్లు సీఎం కెసిఆర్ ప్రకటించారు. ఈ దశలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు చేస్తున్న కృషి మాత్రం అభినందనీయం. గ్రామాలను పరిపుష్టం చేసే దిశగా అనేక కార్యక్రమాలు సాగుతున్న తీరు ఇరత రాష్ట్రాలకు ఆదర్శం కావాలి. కార్యక్రమాలు ఏవైనా, పేర్లు ఏవైనా ఇరురాష్ట్రాల్లో ఇంచుమించుగా ఒకేతరహా కార్యక్రమాలు సాగుతున్నా యి. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కులవృత్తులకు చేయూత,నీటి సంరక్షణ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే వ్యవసాయ పరిరక్షణ ఉద్యమం కూడా సాగుతోంది. అయితే ఇన్నేళ్ల దరిద్రం ఈ రెండు మూడేళ్లలో పోతుందని భ్రమించలేం. దూనికైనా కొంత సమయం కావాలి. తెలంగాణలో కులవృత్తును బలోపేతం చేయడం అన్నది గ్రామీణ అర్థిక వ్యవస్తను బలోపేతం చేసేదిగా గమనించాలి. పరిశ్రమల పేరుతో పర్యావర ణాన్ని నాశనం చేసుకునే కన్నా మన వ్యవసాయ పరిశ్రమను బాగు చేసుకోవడం మంచిది. సీఎంలు ఇద్దరూ బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలపై వరాల జల్లు కురిపిస్తున్న తీరు వారిని మచ్చిక చేసుకోవడానికే అన్న విమర్శలు సరికాదు. వారి బతుకులు బాగుచేయడానికి సకల ప్రయత్నాలు చేస్తున్న తీరుగా చూడాలి. తెలంగాణలో నీటి లభ్యత క్కువ. తాగడానికే నీళ్లు లేవు. ఇక సాగునీరు సంగతి సరేసరి. ఈ రెండు లక్ష్యాల కోసం తెలంగాణలో మిషన్ కాకతీయ,మిషన్ భగీరత కార్యక్రమాఉల చేపట్టారు. వీటి ఫలాలను ప్రజలు త్వరలోనే అందుకోబోతున్నారు. ఇంటింటికి మంచినీళ్లు ఇస్తుంటే అప్పులు చేస్తున్నారంటూ అడ్డగోలు ఆరోపణలు చేస్తున్న వారు గతంలో వేలకోట్లు దుబారా గురించి మాట్లాడడం లేదు. ప్రాజెక్టులు కట్టి తెలంగాణ నేలంతా సస్యశ్యామలం చేస్తుంటే ప్రాజెక్టులను రీడిజైన్ చేస్తున్నారని అవాకులు, చెవాకులు పేలుతున్నారు. ప్రభుత్వాలు ఏర్పడటం, కొత్త పథకాలు ప్రవేశపెట్టడం, ఆర్భాటాలు చేయడం, పథకాలను చివరికి పేపర్లకు అంకితం చేయడం మనం దశాబ్దాలుగా చూస్తున్నదే. కానీ ఇప్పుడు అలా కాకుండా క్షేత్రస్థాయిలో పనులు జరుగుతన్నాయి. ప్రధానంగా చెరువుల పునరుద్దరణ అన్నది పెద్ద ఎత్తున ఇరు రాష్ట్రాల్లో సాగుతోంది. వ్యవసాయానికి పెద్ద ఎత్తున కృషి జరుగుతోంది. అందుకే కంది,మిర్చి, పసుపు పంటల దిగుబడి పెరిగింది. వరి ధాన్యం దిగుబడులు పెరగగలవని అంచనా వేస్తున్నారు. ఇవన్నీ అభివృద్ధి కోణంలోనే చూడాలి. ధరలు దక్కకపోవడం, కొనుగోళ్లు లేకపోవడం అన్నది వేరు సమస్య.

# కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె

### ప్రైవేట్ బస్సులతో ప్రయాణికుల ఇక్కట్లు

ఖమ్మం,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె ఐదో రోజు ఉధృతంగా సాగింది. జరిగింది.

ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా 50 శాతం బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో జిల్లాలో ఆర్టీసీకి ఈ మూడు రోజుల్లో సుమారు రూ.90 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారుల అంచనా. కార్మికులు డిపోల పరిధిలో భారీ ప్రదర్శన, ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు జరగలేదు. అయితే సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో పండగకు సొంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులు ఎక్కువ మంది ప్రైవేటు వాహనాలనే ఆశ్రయించారు. జిల్లాలో 193 బస్సులను నడిపారు. శని, ఆదివారాల్లో 167 బస్సులు మాత్రమే తిరగగా, సోమవారం మరో 26 బస్సులను పెంచారు. అయినా అవి ప్రయాణికుల అవసరాలను తీర్చలేకపోయాయి. ఎక్కువ మంది ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లోనే వెళ్లాల్సివచ్చింది. ఃూష్ట ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులతోనే వతనం ప్రారంభం అవుతుందని ఆర్టీసీ జేఏసీ, వివిధ రాజకీయ పక్షాల నాయకులు అన్నారు. ఆర్టీసీ కార్మికుల

ఆధ్వర్యంలో ఖమ్మం,కొత్తగూడెం ఇల్లందులలో భారీ ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శనకు వివిధ రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులను విధుల నుంచి తొలగిం చినట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడం సిగ్గుచేటన్నారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులపై వేటు వేయమనడం ఆయన దిగజారు డుతనానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన కార్మికులను అణగదొక్కేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు అండగా ఉంటామని, ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

# వై. హెచ్.కె. మోహనరావు కవితా సంపుటి "విచ్చుకోవాలి" ఆవిష్కరణ




నూతన సాహిత్య ధోరణలను, నూతన ఆవిష్కరణలనూ కవన లోకమంతా ఆహ్వానించ వలసిన అవసరం వుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత, ప్రముఖ కవి విమర్శకులు డా॥పాపినేని శివ శంకర్ అన్నారు. సెప్టెంబర్ 29న గుంటూరు నగరంలోని యస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో జరిగిన సమ్మేళనంలో నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులు వై.హెచ్.కె. మోహన్‌రావు కవితా సంపుటి 'విచ్చుకోవాలి' ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ ఆవిష్కరణ సభకు ప్రముఖ కవి చిటిప్రోలు వెంకట రత్నం అధ్యక్షత వహించారు. "కరువు కురిసిన మేఘం"లో కవిత్వమై మన ముందుకు వచ్చిన మోహన్‌రావు ఇప్పుడు "విచ్చుకోవాలి" అంటూ కవన రూపమవడం అభినందనీయమని పాపినేని హర్షిం చారు. ప్రపంచ సాహిత్యం చరిత్ర నిర్మాణం, రాజుల ను, రాజ్యాలను ఆశ్రయించి అభివృద్ధి చెందిన కాలం నుండి ఈనాడు విస్మృత ఉపేక్షత మూలాల నుంచి వచ్చే సాహిత్యాన్ని ఆదరించే కాలానికి వచ్చాయని ఆయన వివరించారు. సంపుటిని ప్రముఖ విశ్లేషకులు అనిల్ డ్యానీ సమీక్షిస్తూ "విచ్చుకోవాలి" పొత్తం ఒక ప్రాంతానికి పరిమితమైంది కాదన్నారు. "విస్తృత చూపు"తో రచించిన కవిత్వమన్నారు. మోహన్‌రావు కవిత్వంలో చరిత్ర నలిగిన పేజీల మధ్య విస్తృత పాత్రలను వెలికితీయాలనే తపన కనిపిస్తుందన్నారు. సభలో రంగిశెట్టి ఫౌండేషన్ స్థానికులు రంగిశెట్టి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ప్రధాన కార్యదర్శి బండికల్లు జమదగ్ని అతిథులకు ఆహ్వానం పలికి సభకు సమన్వయ పరిచారు. సభలో మన్నం వెంకట గురువు, పింగళి భాగ్యలక్ష్మి, దబ్బలదాసు, యనమల సుందర్, తాటికోలు పద్మావతి, ఆళ్ళ నాగేశ్వరరావు, సుశంద్రరావు, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రజానాట్య మండలి బాధ్యులు కళాదాసు, కట్టమూరి శంకరరావు, జివియన్ మునేశ్వరరావు, చౌడారెడ్డి, చంద్రగిరి నారాయణరావు, పోగుల విజయశ్రీ, ననగాల జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవి బుర్రికుమార్‌రాజు నిర్వహించిన కవన పున్నమిలో ఎం.విజయకుమార్ ప్రథమ, చిలక అనిత ద్వితీయ, బి. జనార్థనరెడ్డి తృతీయ బహుమతులు అందుకున్నారు.

# గొల్లపల్లి రాంకిషన్ (రాఖీ)కి గౌరవ డాక్టరేట్ ప్రదానం



గత నాలుగు దశాబ్దాలుగా సాహితీ రంగంలో విశేష కృషి సల్పి వృత్తిపరంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్ 1100పై చిలుకు పాటలతో బాటు పలు విభిన్న రకాల సాహితీ ప్రక్రియల్లో సాహితీ సేద్యం చేస్తూ 'లబ్‌డబ్' అనే నూతన లఘు కవితా ప్రక్రియను ఆవిష్కరింపజేసి 5 పుస్తకాలు 10 ఆడియో ఆల్బమ్స్ వెలువరించి, తెలుగు సారస్వత రంగంలో చేసిన సేవకు గాను శనివారం రాత్రి, మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా 'సెయింట్ మదర్ థెరిస్సా విశ్వ విద్యాలయం, బెంగరూరు స్నాతకోత్సవ కార్యక్రమంలో గొల్లపెల్లి రాంకిషన్ (రాఖీ), ధర్మపురికి 'గౌరవ డాక్టరేట్' పురస్కారం అందజేసి సత్కరించినారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ అధికారి కృష్ణకుమార్, సైంటిస్ట్ డా॥ ప్రభాకరన్‌లతో బాటు డా॥ ఇసాముద్దీన్ పాపా ఛాన్సలర్, డా॥ విజయలక్ష్మి సరస్వతి వైస్ ఛాన్సలర్‌ల చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేయడం జరిగింది.

# సింగరేణిపై కమలం పట్టు

### కార్మిక సంఘం బలోపేతం కోసం ప్లాన్

### వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న కిషన్ రెడ్డి

కొత్తగూడెం,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): గతంలో ఎప్పుడూ లేనంతంగా సింగరేణిపై బిజెపి దృష్టి సారించింది. సింగరేణిని నష్టాల్లో ముంచారని ఇటీవల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన ప్రకటన ఇక్కడ గమనార్హం. ఆయన సింగరేణి ఏరియాలో పర్యటించి టిఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సింగరేణిలో పట్టుకోసం బీజేపీ చేపట్టిన వ్యూహం అధికార టీఆర్ఎస్ నాయకులను కలవరపెడుతోంది. సింగరేణి పరిధిలో పార్టీ బలోపేతం బాధ్యతలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పార్టీ జాతీయ నాయకత్వం అప్పగించినట్లు సమాచారం. సింగరేణిలో గుర్తింపు ఎన్నికల నేపథ్యంలో కార్మిక క్షేత్రంగా ఉన్న ఆరు జిల్లాల నేతలతో కిషన్‌రెడ్డి టచ్‌లో ఉంటూ బీఎంఎస్ బలోపేతా నికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో టీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పాటు ఆ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల నుంచి బలమైన నాయకులను పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు జరుగుతు న్నాయి. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని సింగరేణి కార్మికులతో సంబంధాలు గల మాజీ ఎంపీ గడ్డం వివేక్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, రామగ ుండం కార్పొరేషన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్లను కూడా చేర్చుకుంది. ఇప్పుడు బలమైన కార్మిక నాయకులపై దృష్టి పెట్టింది. టీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గు గనికార్మిక సంఘం (టీబీజీకేఎస్)లో అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ నేత, ప్రస్తుత వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్యను బీఎంఎస్‌లోకి చేర్చుకునే ందుకు రంగం సిద్ధమైంది. మల్లయ్యతో పాటు అన్ని ఏరియాల నుంచి భారీగా చేరికలు ఉండవచ్చనే ప్రచారం సాగుతోంది. సుమారు 3వేల మంది తన వెంట బీఎంఎస్ చేరతారని మల్లయ్య చెబుతుండగా, లైన్‌లోకి వచ్చిన టీఆర్ఎస్ దీనిపై దృష్టి సారించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆహ్వానం మేరకు కార్పొరేట్ ఏరియా టీబీజీకేఎస్ యూనియన్‌కు రాజీనామా చేసిన నేతలమంతా ఈ నెల 30న బీఎంఎస్‌లో చేరతామని టీబీజీకేఎస్ మాజీ నేత టి నరేంద్రబాబు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సింగరేణి కార్మికులను మచ్చిక చేసుకునే ప్రయత్నాల్లో మునిగిపోయారు.

ఇప్పటికే బెల్లంపల్లి రీజియన్‌లోని శ్రీరాంపూర్ ఏరియాలో మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు గనులపై పర్యటించి తామున్నామంటూ భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. 29న భూపాలపల్లి జిల్లాలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరుకా నున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వనమా వెంకటేశ్వరరావు గనులపై సమావేశాలు నిర్వహిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతుగా కృషి చేస్తున్నామని హామీ ఇస్తున్నారు. రామగుండంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు మంత్రి కొప్పుల ఈశ్వర్ కార్మిక సంఘాల నాయకులతో చర్చిస్తున్నారు. బీఎంఎస్‌లోని టీఆర్ఎస్, టీబీజీకే ఎస్‌కు చెందిన ముఖ్య నేతలతో పాటు కార్మికులెవరూ వెళ్లకుండా కట్టడిచేసే ప్రయత్నంలో ఉన్నారు.

ఈ మేరకు రాష్ట్ర అధిష్టానం నుంచి స్పష్టమైన దిశానిర్దేశం వచ్చినట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి పరిధిలో పట్టుకోసం బీజేపీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. గోదావరి పరీవాహక ప్రాంతం వెంట విస్తరించి ఉన్న కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పట్టు సాధించాలని చూస్తోంది. ఇందులో భాగంగా సింగరేణి కంపెనీలో పనిచేస్తున్న సుమారు 50వేల మంది పర్మనెంట్ ఉద్యోగులను, 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఆకర్షించడం ద్వారా ఈ ప్రాంతం విస్తరించి ఉన్న 11 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పట్టు సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశిరచుకు న్నట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తెలంగాణ రాష్ట్ర సమితి సింగరేణి బెల్ట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరులలో మినహా మిగతా 8 చోట్ల పరాజయాన్ని మూట గట్టుకొన్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు తరువాత పరిణామాల్లో టీఆర్ఎస్‌లో చేరినప్పటికీ, ప్రజాభిప్రాయం భిన్నంగా ఉందనే విషయాన్ని బీజేపీ గుర్తించింది. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ద్వారా తన ప్రణాళికను అమలు చేసే ఆలోచనతో ఉంది. సింగరేణిలో ఎన్నికల్లో ఈసారి గుర్తింపు యూనియన్‌గా బీజేపీ అనుబంధ విభాగమైన బీఎంఎస్‌ను గెలిపించి కార్మిక క్షేత్రంలో పట్టు నిలుపుకోవాలని ఆ పార్టీ నాయకులు కృత నిశ్చయంతో ఉన్నారు. ఇప్పటికే కేంద్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి ఈబాధ్యతలు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిలో భాగంగానే గత నెల 26న కేంద్ర రసాయనాల, ఎరువుల శాఖ మంత్రి సదానందగౌడ రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని సందర్శించి వెళ్లారు. మంత్రి వస్తున్న సమాచారాన్ని అధికారికంగా స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా ఇవ్వకపోవడం సింగరేణిపై బీజేపీ దూరదృష్టిని తెలియజేస్తోంది. ఈ పర్యటన అధికారికంగా ఆర్ఎఫ్‌సీఎల్ ఫ్యాక్టరీ సందర్శన అయినప్పటికి కార్యకర్తల్లో మరింత విశ్వాసాన్ని నింపేందుకు 370ఆర్టికల్ పేరుతో ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరై మీవెంట తామున్నామంటూ సందేశం పంపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నుంచి సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియా గులాబీదళానికి అండగా నిలిచింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి పరిధిలోని నియోజక వర్గాల్లో ఖమ్మం జిల్లాలో మినహా దాదాపు అంతటా టీఆర్ఎస్ జయకేతనం ఎగరేసింది. 2017లో జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందని తొలుత భావించినా, కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి ప్రణాళిక అమలు చేయడంతో భూపాలపల్లి, మందమర్రి మినహా అన్ని ఏరియాల్లో టీబీజీకేఎస్ ఘన విజయం సాధించింది. మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో కూడా సింగరేణి ప్రాంతం పరిధిలోని పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు స్థానాల్లో టీఆర్ఎస్ విజయం సాధించింది.

# పాక్ ఆర్మీ చీఫ్ అనూహ్య నిర్ణయం

### జిన్‌పింగ్ భారత్ పర్యటన నేపథ్యంలో చైనా పర్యటన

బీజింగ్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఖమర్ జావేద్ బజ్వా చైనా పర్యటనకు వెళ్లారు. అక్కడి మిలటరీ ఉన్నతాధికారులతో సమావేశమై విస్తృత చర్చలు జరిపారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అధికారిక పర్యటన కోసం భారత్‌కు రావాల్సి ఉండగా.. దానికి కొద్ది రోజుల ముందే జనరల్ బజ్వా చైనా పర్యటనకు వెళ్లడం గమనార్హం. స్థానిక మీడియా కథనం ప్రకారం.. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ)

ఉన్నతాధికారులతో బజ్వా జమ్మూ కశ్మీర్ పరిస్థితిపైనా, అక్కడ భారత్ చేపట్టిన భద్రతా ఏర్పాట్ల పైనే ప్రధానంగా చర్చలు జరిపారు. పీఎల్ఏ ప్రధాన కార్యాలయంలో పీఎల్ఏ కమాండర్ ఆర్మీ జనరల్ హాన్ విగువో, సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ) వైస్ చైర్మన్ జనరల్ జు ఖిలియాంగ్ తదితరులతో సమావేశమైన బజ్వా.. కశ్మీర్ అంశాన్ని ప్రముఖంగా లేవనెత్తినట్టు బీజింగ్ అధికారులు ధ్రువీకరించారు.

చైనా పర్యటనకు వెళ్లిన పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో పాటు జనరల్ బజ్వా కూడా వెళ్లారు. సీపీఈసీ ప్రాజెక్టుపై చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌తో పాక్ ప్రధాని ఇమ్రాన్ చర్చలు జరపనున్నారు. కాగా జనరల్ బజ్వా, పీఎల్ఏ అధికారుల సమావేశం నేపథ్యంలో పాకిస్తాన్ ఆర్మీ స్పందించింది. జమ్మూ కశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై పాకిస్తాన్ ఆందోళనను చైనా ఆర్మీ గుర్తించినట్టు చెప్పుకొచ్చింది. కాగా కశ్మీర్‌కి సంబంధించి ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాలను భారత్ గుర్తించి, అమలు చేసినప్పుడే కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని పీఎల్ఏ అధికారులతో జనరల్ బజ్వా చెప్పినట్టు పాక్ ఆర్మీ మీడియా ఐఎస్‌పీఆర్ వెల్లడించింది.

# ఉమ్మడి జిల్లాలో కార్మికుల నిరసన

### సర్కార్ తీరుపై మండిపడ్డ నేతలు

మెదక్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ సమ్మె ఉధృతంగా సాగుతోంది. కార్మికులు డిపోల ముందు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తక్షణం తమ సమస్యలు పరిష్కరించాలని డియ మాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్నివర్గాల మద్దతును కూడకట్టుకుని రాష్ట్రంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించి నియంత ప్రభుత్వానికి బుద్ధి చెప్పే వరకు విశ్రమించేదిలేదని ఆర్టీసీ టీఎంయూ రాష్ట్రకార్యదర్శి ఎంఆర్‌కె రావు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు నల్లబ్యాడ్జీలతో పట్టణంలో నిరసనలు వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించక పోవటంతోనే సమ్మెబా ట పట్టామన్నారు. సమస్య పరిష్కరిం చకుండా ప్రభుత్వం కార్మికులను బెదిరించటం ఎంతవరకు సమంజస మన్నారు. రాష్ట్రంలో 55 వేల మందికార్మికులు ఒక్కమాటపై నిలబడి సమ్మెలో కొనసగాడం కార్మికుల నైతిక విజయం అని అన్నారు. రాష్ట్రంలో రైతుల నుంచి మొదలుకుని అందర్ని మోసం చేసిన కేసీఆర్‌కు గతంలో చంద్రబాబుకు పట్టిన గతే పడుతుం దని ఎంఆర్‌కే రావు అన్నారు. ఒక్క ఉద్యోగిని తొలగించనా రాష్ట్రం అగ్నిగుండం కావటం ఖాయమని ఎంఆర్‌కె రావు అన్నారు. ఆటోడ్రైవ ర్లను లారీడ్రైవర్లను తీసుకొచ్చి ఎలాంటి టికెట్లు లేకుండా బస్సులను నడపిస్తూ సీఎం దోపిడిదారితనానికి ఆజ్యం పోస్తున్న నియంత సీఎం కేసీఆర్ అని విమర్శించారు. సీఎం ఇచ్చిన హామాలనే నెరవేర్చ కుండా మాపై కక్షసాధింపు చర్యలకు పాల్ప డుతున్నారని అన్నారు. టీచర్లను, రైతు లను, నిరుద్యోగులను, ఆర్టీసీ కార్మి కులను, ఉపాధ్యాయులను, ఉద్యోగు లను అందరిని మోసం చేసిన నియ ంత పాలనకు చరమగీతం పాడేందుకు అన్నివర్గాల ప్రజలం ఏకం కావల్సిన సమయం ఆసన్న మైందన్నారు. కార్యక్రమానికి సీఐటీయూతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాలు మద్దతును ఇచ్చాయి.

# పండగ ప్రయాణీకులకు తప్పని తిప్పలు

### ప్రజల అవసరాలు తీర్చని ప్రైవేట్ బస్సులు

### తాత్కాలిక ఉద్యోగాల కోసం యువత ఆసక్తి

కరీంనగర్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): దసర పండగ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమ్మె సందర్భంగా బస్సులు బంద్ ఉండటంతో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.సమ్మె కారణంగా ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా ఆర్టీసీ యాజమాన్యం తాత్కాలిక విధుల కోసం కండక్టర్, డ్రైవర్ల రిక్రూట్‌మెంట్ చేపట్టింది. ఈ రిక్రూట్‌మెంట్‌కు యువకులు తరలివచ్చారు. 10వ తరగతి పాస్ అయిన వారిని కండక్టర్లుగా, హెవీ మోటార్ వెహికిల్ లైసెన్స్ ఉన్నవారిని డ్రైవర్లుగా తీసుకున్నారు. వీరికి సంబంధించిన అన్ని అర్హత పత్రాలను పరిశీలించి తాత్కాలిక విధుల్లోకి తీసుకున్నారు. జిల్లాలో 91 మంది డ్రైవర్లు, 91 మందిని కండక్టర్లుగా విధుల్లోకి తీసుకున్నారు. కరీంనగర్ నుంచి సికింద్రాబాద్‌కు ఒక్కొక్కరికీ రూ.300 నుంచి రూ.400 వరకు చార్జి వసూలు చేశారు. దగ్గరికి ప్రయాణానికి ప్రజలు ఎక్కువగా ఆటోలను ఆశ్రయించారు. 30 నుంచి 40 కిలోమీటర్ల దూరానికి మాత్రం ఆర్టీసీ నిర్ణయించిన చార్జీలు వసూలు చేయగా, దూరప్రాంతాలకు వెళ్లే వారి నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేశారు. సమ్మె సందర్భంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా కల్పించిన సౌకర్యాలను జేసీ జీవీ. శ్యామ్‌ప్రసాద్‌లాల్ పరిశీలించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సరిపడా బస్సులు నడుపుతున్నామని తెలిపారు. జిల్లాలో 206 ఆర్టీసీ అద్దె బస్సులు ఉండగా వాటిలో 191 బస్సులు సికింద్రాబాద్, హన్మకొండ, గోదావరిఖని, నిజామాబాద్, సిరిసిల్ల, వేములవాడ తదిరత ప్రాంతాలకు నడుపుతున్నట్లు వివరించారు.డిపో మేనేజర్లు, ఎంవీఐలు ఆధ్వర్యంలో నైపుణ్యాన్ని పరిశీలించి 195 మంది డ్రైవర్లను తాత్కాలికంగా విధుల్లోకి తీసుకున్నట్లు తెలిపారు. 195 మంది కండక్టర్లను విధుల్లోకి తీసుకుని బస్సులు నడుపుతున్నా మన్నారు. జిల్లాలోని 79 విద్యా సంస్థలు, 17 కాంట్రాక్ట్ క్యారియర్ సీసీ బస్సులు నడుపుతున్నామన్నారు. ముందస్తుగా తెలిపిన విధంగానే ప్రయాణ చార్జీలు వసూలు చేయాలని ఆదేశాలు జారీచేశామన్నారు. ఆర్టీసీ జేఏసీ నాయకులు అర్ధరాత్రి నుంచే డిపోల నుంచి బస్సులు బయటికి రాకుండా అక్కడే తిష్టవేశారు. ఉదయం 5 గంటల నుంచి కార్మికులు బస్టాండ్‌కు చేరుకుని నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ ఇబ్బందులను ప్రయాణికులు, ప్రజలకు వివరిస్తూ భిక్షాటన చేశారు. సమ్మె తొలిరోజు సంపూర్ణంగా జరిగినా బస్సుల బంద్ పాక్షికంగానే సాగింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని 10 డిపోలకు చెందిన 91 ఆర్టీసీ బస్సులు, 90 అ÷-దదె బస్సులు, విద్యా సంస్థలకు సంబంధించిన 55 బస్సులు మొత్తం 236 బస్సులను అధికారులు నడిపించారు. ఇవే కాకుండా ఇతర ప్రైవేటు ట్రావెల్ వాహనాలు నడిపించారు. దసరా సందర్భంగా 90 శాతం మంది ప్రయాణికులు ఇప్పటికే స్వగ్రామాలకు చేరుకోవడంతో ప్రయాణికుల రద్దీకూడా అంతగా కనిపించలేదు. ఆర్టీసీ యాజమాన్యం బస్సులు ఏర్పాటు చేసినా ప్రయాణికులు అనుకున్నంత రాక బస్టాండ్ వెలవెలబోయింది. ప్రయాణికులపై సమ్మె ప్రభావం పడకుండా ఉండేందుకు ఆర్టీసీ, జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా పర్యవేక్షించారు. ఆర్టీసీ, డీటీసీ ప్రైవేటు సంస్థల నుంచి వాహనాలను ప్రయాణికుల కోసం ఏర్పాటు చేశారు.

# మా భద్రత కోసమే రఫేల్..

### -ఎవర్నీ భయపట్టే ఉద్దేశం కాదు

### -కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్

(ఫ్రాన్స్, అక్టోబర్9(ఆర్ఎన్ఎ) : రఫేల్ యుద్ధ విమానం తీసుకుంది ఎవర్నీ భయపెట్టే ఉద్దేశంతో కాదని, భారత్ దేశ భద్రత కోసమే అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రెండు రోజుల ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అక్కడ డసోల్ ఏవియేషన్ సంస్థ నుంచి తొలి రఫేల్ యుద్ధ విమానాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రఫేల్ యుద్ధ విమానానికి ఆయుధపూజను నిర్వహించిన అనంతరం అందులో ప్రయాణించారు. రఫేల్‌లో దాదాపు 25 నిమిషాల పాటు ప్రయాణించిన రాజ్‌నాథ్.. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అత్యాధునిక ఆయుధా లు సమకూర్చుకొని ఏ దేశాన్నీ భయపెట్టే ఉద్దేశం భారత్‌కు లేదన్నారు. కేవలం తమ రక్షణ సామర్థ్యాన్ని పెంపొం దించుకోవడమే లక్ష్యమని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. రఫేల్‌లో విహరించడం ఎంతో సౌకర్యంగా, హాయిగా ఉందని .. జీవితంలో ఇలాంటి క్షణాలు ఒక్కసారే వస్తాయని సంతోషం వ్యక్తం చేశారు. ఓ యుద్ధ విమానంలో కూర్చుని సూపర్‌సోనిక్ వేగంతో ప్రయాణిస్తానని తాను కలలో కూడా ఊహించలేదని తన అనుభూతిని పంచుకున్నారు. రఫేల్ రాకతో వైమానిక దళం మరింత శక్తివంత మవుతుందని ఆయన అభిప్రాయప డ్డారు. ఫిబ్రవరి 2021 నాటికి మరో 18 రఫేల్ యుద్ధ విమానాలు భారత్‌కు అందనున్నాయని ఆయన తెలిపారు. మే 2022 నాటికి మొత్తం 36 యుద్ధ విమానాలు భారత్‌కు ఫ్రాన్స్ అప్పగించనుంది. రఫేల్ ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కాల్సిన అవసరం ఉందని, ఆయన సాహసోపే తమైన నిర్ణయాలు దేశ భద్రతకు లబ్ది చేకూరుస్తున్నాయని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. భారత వైమానిక దళం 87వ వార్షికోత్సవం జరుపు కున్న వేళ రఫేల్ యుద్ధ విమానాన్ని ఫ్రాన్స్ అందజేయడం విశేషం. ఆర్బీ 001 నెంబరు గల రఫేల్ జెట్‌ను డసోల్ట్ ఏవియేషన్ సంస్థ హెడ్ పైలట్ ఫిలిప్పీ ద్యుచెట్యూతో కలిసి ప్రయాణిం చారు. ప్రపంచం లోనే నాలుగో అతిపెద్ద వైమానిక దళమైన భారత్ వాయుసేనలో బహుళ సామర్థ్యం కలిగిన రఫేల్ చేరికతో మరింత బలోపేతమవుతుం దని, గగనతలంలో భద్రత, శాంతికి ఇది ఎంతగానో ఉపయోగపడ ుతుందని అన్నారు. ఫ్రెంచ్ భాషలో రఫేల్ అంటే వాయువేగం.. ఈ యుద్ధ విమానం తన పేరును సార్థకత చేసు కుంటుందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.